TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :223 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 13-11-2025 పేజీలు:4 వెల: 2.00

## ఢిల్లీ పేలుళ్ల ఘటనలో ఆందోళనకర విషయాలు

న్యూఢిల్లీ,ఢిల్లీ పేలుళ్ల ఘటన తీరుతెన్నులతో దర్యాప్తు సంస్థలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యావంతులు అతివాదంవైపు మొగ్గు చూపుతున్న వైనంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఫరీదాబాద్ ఉగ్రకుట్ర భగ్నం తరువాత ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుళ్లు సంభవించిన విషయం తెలిసిందే. ఇక ఫరీదాబాద్‌లో పలువురు ఉగ్రవాదుల అరెస్టు అనంతరం డా.ఉమర్ అప్రమత్తమై ఢిల్లీలో కారుతో ఆత్మాహుతి దాడికి దిగాడని పోలీసులు భావిస్తున్నారు. ఇక ఫరీదాబాద్ ఉదంతంలో పట్టుబడ్డ మహిళ డాక్టర్ షాహీన్.. ఉగ్రవాదులకు నిధుల సేకరణలో కీలకంగా వ్యవహరించినట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆమెను విచారిస్తున్నారు. డా.షాహీన్ సయీద్ యూపీ వాస్తవ్యురాలు. ఆత్మాహుతి దాడి చేసిన ఉగ్రవాది ఉమర్‌కు ఆమె తెలుసని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో కీలక నిందితుడిగా ఉన్న ముజమ్మిల్‌తో ఆమెకు సంబంధం ఉందని కూడా తెలుస్తోంది. భారత మహిళల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు పాక్ ఉగ్ర సంస్థ జైష్-ఏ- మహమ్మద్ ప్రయత్నాలతో డా.షాహీన్ అతివాదంవైపు మళ్లినట్టు తెలుస్తోంది. ఇతర మహిళలను తమ కార్యకలాపాల్లో చేర్చుకునేందుకు కూడా ప్రయత్నించినట్టు

## సాయుధ దళాల భవిష్యత్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది..



న్యూఢిల్లీ,భారత భౌగోళిక స్థానం బట్టి కరెన్సీ ఆఫ్ విక్టరీగా ఉంటుందన్నారు. ట్రంప్, పుతిన్ అలాస్కాలో చర్చల సమయంలో భూమిపై దృష్టి పెట్టారని.. సాంకేతికత మనకు భూమిపై ప్రయోజనాన్ని ఇవ్వాలన్నారు. భూమిపై స్మార్ట్ బూట్స్, బాట్స్ రెండూ ఉంటాయని.. దీని అర్థం సైనికులు, యంత్రాలు కలిసి పని చేయడమన్నారు. అయితే, యుద్ధ సమయంలో సాంకేతికత కొన్నిసార్లు విఫలం కావొచ్చని.. కాబట్టి సైనికులు సాంకేతికత లేకుండా పోరాడగలగాలన్నారు. దీన్ని మేఘ-కేంద్రీకృత, నెట్‌వర్క్-కేంద్రీకృత యుద్ధం మిశ్రమంగా ఆయన అభివర్ణించారు.ప్రపంచం ప్రస్తుతం ఇండస్ట్రీ 4.0ని దాటి ఇండస్ట్రీ 5.0 వైపు కదులుతోందని ఆర్మీ చీఫ్ తెలిపారు. ఇండస్ట్రీ 4.0 ఏఐ, క్వాంటం టెక్నాలజీ వంటి వాటి గురించి మాట్లాడిందని.. కానీ టెక్నాలజీ మానవులను భర్తీ చేయకూడదని, వాటిని పూర్తి చేయాలని 5.0 గ్రహించిందన్నారు. మానవ కేంద్రీకృత సాంకేతికతను స్వీకరించే దిశగా మనం కదులుతున్నందున ఇది భారత సైన్యానికి చాలా ముఖ్యమన్నారు. ఐఏ ద్వారా మానవ విస్తరణ దిశలో మనం ఆలోచించాలని చెప్పారు. ప్రపంచం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, గేమ్ కన్సోల్‌లు, 7-నానోమీటర్ మైక్రోచిప్‌లను కలిగి ఉన్న టెక్నాలజీ జనరేషన్-7 వైపు కదులుతోందని పేర్కొంటూ జనరల్ ద్వివేది అత్యాధునిక టెక్నాలజీపై స్పందించారు. భారత సైన్యం వాటి ప్రయోజనాలను పెంచుకోగలదని నిర్ధారించుకోవడానికి మనం ఈ సాంకేతికతలన్నింటినీ కలిపి సమగ్రపరచాలన్నారు. వారసత్వ వ్యవస్థలు అదృశ్యం కావని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు. అవి కనీసం రాబోయే ఐదు నుంచి ఐదేళ్ల వరకు కొనసాగుతాయని.. కాబట్టి మనం వాటిని మెరుగుపరచి సమర్థవంతంగా చేయాలన్నారు.డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల్లో ఇంకా ఖాళీలున్నాయని చెప్పారు. నెట్‌వర్క్ స్పెక్ట్రం పూర్తిగా పరిణతి చెందలేదని.. ఉపగ్రహ ప్రాజెక్టులు కూడా మూడు సేవల్లో సమయం తీసుకుంటున్నామయని.. 2027 నాటికి దాదాపు 2.3 మిలియన్ల ఏఐ సంబంధిత ఉద్యోగులు ఉంటాయన్నారు. కానీ నైపుణ్యం కలిగిన మానవశక్తి సగం లేదంటే దాదాపు 1.2 మిలియన్లు మాత్రమే ఉంటుందని చెప్పారు. ఇదే జరిగితే సైన్యం ఏఐ సేవలను అవుట్‌సోర్స్ చేయాల్సి వస్తుందన్నారు. ఇది ఖరీదైన ప్రతిపాదన అవుతుందని.. అందుకే మనం ఈ రోజు నుంచే సిద్ధం కావాలని.. పాఠశాలల్లో ఏఐ నైపుణ్యాన్ని ప్రవేశపెట్టాలన్నారు. సైన్యంలో ఏఐ నిపుణులకు శిక్షణ ఇవ్వాలన్నారు. రక్షణ సేకరణ వ్యవస్థలో ఇటీవల ప్రధాన సంస్కరణలు జరిగాయని చెప్పారు. కొత్త రక్షణ సముపార్జన విధానం వేగంగా అభివృద్ధి చెందుతోందని.. డిసెంబర్ నాటికి ఖరారవుతుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలవుతుందన్నారు. దేశంలో కొన్ని కీలక టెక్నాలజీ ఇంకా అభివృద్ధి కాలేదని.. ప్రస్తుతం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. సైబర్, డేటా వల్నరబిలిటీస్ లోపాలు ప్రధాన సవాల్‌గా ఆయన అభివర్ణించారు.

## ఢిల్లీ పేలుడులో కీలక మలుపు..వెలుగులోకి వచ్చిన సిసి టివి దృశ్యాలు



న్యూఢిల్లీ,నవంబర్12: ఢిల్లీ బాంబ్ పేలుడు యావత్తు దేశాన్ని కలవరపాటుకు గురిచేసింది. ప్రశాంతంగా ఉన్న దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎర్రకోట ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర కారు బ్లాస్ట్ అయింది. పెద్ద ఎత్తున విస్ఫోటనం జరగడంతో ఒక్కసారిగా ఏం జరిగిందో తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యారు. అక్కడికక్కడే కొందరు ప్రాణాలు కోల్పోగా.. ఇంకొందరు గాయపడ్డారు. మరికొందరు ప్రాణభయంతో పరుగులు తీశారు. తాజాగా బాంబ్ బ్లాస్ట్‌కు సంబంధించిన సిసి టివి దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. సోమవారం సాయంత్రం 6:50 గంటల ప్రాంతంలో ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నెంబర్-1 సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ ఉంది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఇందులో హ్యుందాయ్ ఐ20 కారు ఒక్కసారిగా పేలిపోయింది. అధిక తీవ్రతతో కూడిన పేలుడు సంభవించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యింది. సీసీటీవీ ఫుటేజ్ ఈరోజు వెలుగులోకి వచ్చింది. ఇక ఈ పేలుడులో ఇప్పటి వరకు 12 మంది చనిపోగా.. పలువురు గాయపడ్డారు. ప్రస్తుతం దర్యాప్తు సంస్థలు తీవ్రంగా విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే ఫరీదాబాద్‌లో అరెస్టైన డాక్టర్ ముజమ్మిల్ నుంచి కీలక విషయాలను రాబట్టాయి. ఎర్రకోట దగ్గర జరిగిన దాడి దీపావళి నాడు ప్లాన్ చేసినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి. దీపావళి నాడు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో దాడి చేయాలని ప్లాన్ చేశామని.. అనంతరం ఆ ప్లాన్ రద్దు చేసుకున్నట్లుగా ముజమ్మిల్ దర్యాప్తు అధికారులకు చెప్పినట్లుగా సమాచారం. ఇక ఈ పఎ÷-లాన్‌ను జనవరి 26, 2026న అమలు చేయాలని ప్రణాళిక వేసుకున్నామని.. ఇందులో భాగంగానే ఎర్రకోట చుట్టు పక్కల ప్రాంతాలను గుర్తించినట్లుగా ముజమ్మిల్ పోలీసులకు తెలియజేసినట్లుగా వర్గాలు పేర్కొన్నాయి.

## వాయు కాలుష్యంతో పెరిగిన శ్వాసకోశ సమస్యలు..



న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కాలుష్యం కోరల్లో చిక్కుకున్నది. దీపావళి నుంచి వాయు కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. పిల్లలు, గర్భిణులు, వృద్ధులకు వాయు కాలుష్యంతో ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. వాయు కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చెస్ట్ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఉత్తరభారతంలోని అన్ని రాష్ట్రాలకు దాదాపు 33 పేజీలతో కూడిన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో ఆరోగ్య వ్యవస్థను అప్రమత్తం చేస్తూ.. కాలుష్యంతో శ్వాసకోశ, గుండెజబ్బులు పెరుగుతున్నాయని చెప్పింది. అందువల్ల ఆసుపత్రులను ప్రత్యేకంగా సిద్ధం చేయాలని చెప్పింది. వాయు నాణ్యత క్షీణిస్తుందని.. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన సవాల్‌గా మారిందని ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసేందుకు అందరూ కలిసి పని చేయాలన్నారు. ఛాతీ క్లినిక్‌లో కాలుష్యంతో ప్రభావితమైన రోగులను ఎలా నివేదించాలి? సమస్యలను ఎలా నిర్వహించాలి? అన్నదానిపై ఆరోగ్యమంత్రిత్వశాఖ మార్గదర్శకాల్లో స్పెషల్‌గా ఫార్మాట్‌ను ఇచ్చింది. ప్రతిరోజూ ఆసుపత్రుల నుంచి జిల్లాలకు.. అక్కడి నుంచి ఢిల్లీకి పంపడం తప్పనిసరని పేర్కొంది.ఈ సందర్భంగా నిర్మాణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లోని విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహించాలని ఆదేశించింది. 5వ తరగతి వరకు ఆన్‌లైన్‌లోనే జరగాలని చెప్పింది. నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా నీరు చల్లడం, కవర్లతో కప్పివేయడం, కార్మికులకు కిట్లు, మాస్క్‌లు అందించాలని కేంద్రం ఆదేశించింది. నిర్మాణరంగంలోని కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించడంతో పాటు శిక్షణ ఇవ్వాలని చెప్పింది. అదే సమయంలో రాష్ట్రాలు, జిల్లాల టాస్క్‌ఫోర్స్‌లను యాక్టివ్ చేయాలని చెప్పింది. పర్యావరణ, రవాణా, పట్టణాభివృద్ధి, మహిళాశిశు అభివృద్ధి, కార్మికశాఖలతో సమన్వయం చేయాలని కేంద్ర కార్యదర్శి లేఖనలో పేర్కొన్నారు. అలాగే, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇప్పటికే అమలు చేయడిన గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ ని ఖచ్చితత్వంతో అమలు చేయాలని చెప్పింది. వాయు కాలుష్యం శ్వాసకోశ వ్యాధులకు మాత్రమే కాకుండా గుండె, మెదడు, నాడీ వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రిత్వశాఖ పలు సూచనలు చేసింది. కాలుష్యం నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళ్లలో బయటకు వెళ్లడం, రన్నింగ్ చేయడం, వాకింగ్ తదితర శారీరక వ్యాయామాలు మానుకోవాలని చూపింది. అలాగే, ఉదయం, సాయంత్రం వేళల్లో ఇండ్ల కిటికీలు, తలుపులు మూసివేయాలని.. తెరవకూడదని సూచించింది.

## బిఆర్ఎస్,కాంగ్రెస్ దొందూదొందే...



నల్లగొండ,నవంబర్12: తెలంగాణ వచ్చాక కూడా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలు అందలేదని నల్లగొండ జిల్లా కేంద్రంలో కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించడంలో విఫలం అయ్యాయి. ప్రభుత్వాలను అడిగేందుకు, నిలదీసేందుకే జాగృతి జనం బాట చేపట్టామని అన్నారు. జాగృతి జనం బాట'లో భాగంగా నల్లగొండ జిల్లాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలో తన ఫ్లెక్సీలను తొలగించడంపై స్పందించారు. ఫ్లెక్సీలు తొలగించడానికి కవిత తప్పు పట్టారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పెద్ద మంత్రి అనుకున్నా అని విమర్శించారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే.. ఫ్లెక్సీలు తొలగిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను తాను ప్రస్తావిస్తున్నా అని, చేతనైతే ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. నల్లగొండకు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమె అభిమానులు కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కటౌట్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించింది. ? 'సుంకిశాల లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఎస్ఎల్‌బీసీ ఘటనపై విచారణ జరగాలి. నాగార్జున సాగర్ ఎడమ కాలువను రాష్ట్ర ప్రభుత్వం తమ అధీనంలోకి తీసుకోవాలి. కృష్ణా జలాలను నల్లగొండకు తీసుకురాకపోతే.. భూ నిర్వసితులతో ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడిస్తాం' అని అన్నారు. 'బీఆర్ఎస్‌ను తిట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అయినా కూడా కాంగ్రెస్ అదే నిర్లక్ష్యం చేస్తుంది. సీఎం ఆదేశాలను కలెక్టర్‌లు పట్టించుకోవడం లేదు. మా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎపిడ్యూరల్ మెడిసిన్ అందివ్వకపోవడం బాధ అనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎపిడ్యూరల్ మెడిసిన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం భూదాన్ భూములను స్వాధీనం చేసుకోవాలి. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారో సీఎం చెప్పాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని కవిత విమర్శించారు.గత 12 ఏళ్లలో పూర్తి స్థాయిలో జిల్లాకు కృష్ణా జలాలు అందాయో లేదో ఆలోచించాలని అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట అనలేదని.. ప్రాజెక్టుల పరిశీలనలో తాము వెళ్తే నిర్వాసితులు కన్నీరు పెడుతున్నారన్నారు. ఇదేనా బంగారు తెలంగాణ అని ప్రశ్నించారు. నల్గొండ జీజీహెచ్ మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవన్నారు. ఐసీయూలో ఒక్కో బెడ్‌కు ఇద్దరిని పడుకోబెడుతున్నారని తెలిపారు. ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు లేకపోవడం బాధాకరమని కవిత అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఎప్పుడు పూర్తి అవుతుందని ప్రశ్నించారు. భూదాన్ భూములు ఎందుకు వెనక్కి తీసుకోలేదని నిలదీశారు. నాగార్జున సాగర్ రైట్ బ్యాంక్ ఏపీ చేతిలో ఉందని.. లెఫ్ట్ బ్యాంక్ పూర్తిగా సెంట్రల్ చేతులో పెట్టారన్నారు. సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని... అందుకోసం తెలంగాణ జాగృతి పోరాడుతుందని స్పష్టం చేశారు. 20 శాతం తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతోన్న నిబంధనలను సడలించాలన్నారు. కాగా.. నల్గొండ పట్టణంలో పర్యటించిన కవిత.. .జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అయితే కవిత పర్యటన నేపథ్యంలో నల్గొండలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను జాగృతి నాయకులు ఏర్పాటు చేశారు. కానీ రాత్రికి రాత్రే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీనిపై కవిత స్పందిస్తూ.. నల్గొండలో కోమటిరెడ్డికి తనకు పంచాయతీ లేదని.. కానీ తన ఫ్లెక్సీలు తొలగించారని మండిపడ్డారు. అరెస్టు చేసిన జాగృతి నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు నల్గొండ వచ్చానని... పాలిటిక్స్ చేసేటప్పుడు గట్టి వాళ్లనే జాగృతి పోటీలో నిలబెడుతోందని అన్నారు. జాగృతి నాయకులతో పెట్టుకున్నోళ్లు బాగుపడలేదని కవిత వ్యాఖ్యలు చేశారు.

## పోల్ మేనేజ్ మెంట్ లో చతికిలపడ్డ కారు పార్టీ.. ఎందుకిలా?



హైదరాబాద్,ఎంతటి తోపు ఆటగాడికైనా.. మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడు మైదానంలో తన ఆటను ప్రదర్శించే విషయంలో ఫెయిల్ అవుతాడు. తాజాగా ముగిసిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అలాంటి అనుభవమే కారు పార్టీకి ఎదురైందన్న మాట బలంగా వినిపిస్తోంది. పోల్ మేనేజ్ మెంట్ లో తోపు పార్టీగా.. దాన్ని ఢీ కొనే సత్తా మరే పార్టీకి లేదన్నట్లుగా చెప్పే బీఆర్ఎస్ కే కొత్త పాఠాలు నేర్పేలా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సాగిందన్న మాట వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో తన సత్తా చాటిన అప్పటి టీఆర్ఎస్.. ఇప్పటి బీఆర్ఎస్ కు భిన్నంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోల్ మేనేజ్ మెంట్ సాగిందని చెప్పాలి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గత ఎన్నికల వరకు అంటే.. పదేళ్ల (2014-2023) కాలంలో చాలానే ఉప ఎన్నికల్ని తెలంగాణ రాష్ట్రం చూసింది. అందులో ఒకట్రెండు మినహాయిస్తే.. మిగిలిన అన్ని సందర్భాల్లోనూ బీఆర్ఎస్ కు తిరుగులేని పరిస్థితి. ఎన్నిక ఏదైనా.. పోల్ మేనేజ్ మెంట్ విషయంలో పక్కా ప్లాన్ తో మొదలు పెట్టి.. ఫలితం తమకు అనుకూలంగా వచ్చే వరకు విడిచిపెట్టని మొండితనం గులాబీ పార్టీలో కనిపించేది.అందుకు భిన్నంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగినట్లుగా చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ కు ముఖ్యమంత్రి రేవంత్ తన బాధ్యతగా తీసుకోగా.. బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ వ్యక్తిగత పూచీ తీసుకున్నారు. దీంతో.. ఈ ఉపపోరుకు ఎక్కడ లేని ప్రాధాన్యత లభించింది. దీనికి తోడు ఈ ఉప ఎన్నిక ఫలితం రేవంత్ రెండేళ్ల ప్రభుత్వ పాలనకు రిఫరెండమ్ గా పేర్కొనటంతో అధికార పక్షం మరింత అలెర్టు అయ్యింది.ఉప పోరు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి పోలింగ్ కు మూడు రోజుల ముందు వరకు విపరీతమైన ఆత్మవిశ్వాసంతో ఉన్న కారు పార్టీ.. తీరా కీలకమైన పోలింగ్ కు ముందు మూడు రోజుల నుంచి ఆత్మవిశ్వాసం లోపించినట్లుగా చెప్పాలి. దీనికి కారణం కాంగ్రెస్ అధినాయకత్వం చేసిన మైండ్ గేమ్ కూడా కారణంగా చెప్పాలి. ఎన్నికల్లో విజయం తప్పించి మరింకేమీ తమకు అక్కర్లేదన్నట్లుగా వ్యవహరించటమే కాదు.. మంత్రులు మొదలు కింది స్థాయి నాయకుడు సైతం గెలుపు కోసం పడిన శ్రమ అంతా ఇంతా కాదు.ఒక ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవటం కోసం మంత్రులు మొదలు ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు ఇలా వాళ్లు.. వీళ్లు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత విపరీతంగా శ్రమించారు. ఇక్కడే మరో విషయాన్ని ప్రస్తావించాలి. ఉప ఎన్నిక పోలింగ్ కు ఐదు రోజుల ముందు వరకు అంత సీరియస్ గా తీసుకోని మంత్రులు.. కాంగ్రెస్యుబ్ ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు.. ముఖ్యమంత్రి రేవంత్ జోక్యంతో ఒళ్ల వంచి పని చేశారు. ఎక్కడ చూసినా.. ఏ మూల చూసినా గెలుపు ధీమా వ్యక్తమయ్యేలా చేసిన ప్రయత్నం బీఆర్ఎస్ నేతల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లేలా చేసింది.అదే.. చివరివరకు పోరాడే లక్షణాన్ని మిస్ అయ్యేలా చేసింది. పోల్ మేనేజ్ మెంట్ లో తోపు అన్నట్లుగా ఉండే కారు పార్టీ.. కీలకమైన పోలింగ్ వేళ చేతులు ఎత్తేసినట్లుగా వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి బలం చేకూరుస్తూ.. పోలింగ్ అనంతరం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ పార్టీకి గెలుపును కట్టబెడుతూ తమ అంచనాలు వ్యక్తం చేశాయి. ఓట్ల లెక్కింపు వేళ.. ఇదే వాస్తవమైతే.. కారు పార్టీకి చేదు అనుభవాన్ని మిగిల్చిన క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని చెప్పక తప్పదు.

## ఢిల్లీ బాంబు పేలుళ్లు.. వారిపై రఘునందన్ రావు ఫైర్



సంగారెడ్డి జిల్లా, నవంబరు12: ఢిల్లీ ఎర్రకోట బాంబు పేలుళ్ల ఘటనని పలువురు ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వానికి పలువురు సోషల్ మీడియా వేదికగా మద్దతు తెలుపుతున్నారు. అయితే పేలుళ్ల ఘటనలో ఎవరున్నా వదలబోమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్రంగా హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మొత్తం 12 మంది చనిపోయారు. అయితే, ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో బీజేపీ ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు.ఇవాళ(బుధవారం)సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు 'సర్దార్ - ఏక్తా' పాదయాత్ర జరిగింది. ఈ పాదయాత్రలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. బాంబు పేలుళ్లతో బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికలు వస్తే బ్లాస్టులు జరుగుతున్నాయని కొంతమంది సోషల్ మీడియాలో నీచంగా మాట్లాడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపీ రఘునందన్ రావు.ఇంతకంటే దేశద్రోహం ఇంకొక్కటి ఉండదని స్పష్టం చేశారు. పేలుళ్లకు కారణమైన వారి వెనుక బీజేపీ హస్తం ఉందని ఎవరైతే నీచంగా మాట్లాడుతున్నారో.. ఈ విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని హితవు పలికారు. అలాంటి వ్యక్తులను ఎవరూ సమర్థించవద్దని సూచించారు. చేతిలో ఫోన్ ఉందని కొంతమంది ఇష్టం వచ్చినట్లుగా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. బాంబులు పేల్చాలని ఓ వర్గం వాళ్లు కుట్ర పన్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు.

## యువత సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుంది



హైదరాబాద్: యువత సాహసాలు చేసినప్పుడే విజయం దక్కుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఉన్నతస్థానానికి చేరుకోవాలనే లక్ష్యం పెట్టుకుని ఆ దిశగా కష్టపడాలని యువతకు సలహా ఇచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. యువత సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే వారికే ఉజ్జల భవిష్యతు ఉంటుందని వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కొత్త విధానం తీసుకొచ్చామని, అంకుర పరిశ్రమలు వంద కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని, స్టార్టప్‌లకు సాయం చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోందని, ఇతర దేశాల్లో అవకాశాల కోసం చూడవద్దని కోరారు.

## సంపాదకీయం

గురువారం 13-11-2025

# విదిలింపులతో సరి!

కేంద్రంలో బిజెపి సంకీర్ణం, రాష్ట్రంలో టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వాలు ఏర్పడితే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధిని మునుపెన్నడూ లేని విధంగా పరుగులు పెట్టిస్తామనగా, గడచిన ఏడాదిన్నరలో ఆ హామీల ఆచరణ మచ్చుకైనా కనిపించదు. రాష్ట్ర అభివృద్ధి మాటలతోనో గాలిలో మేడలు కడితేనో జరిగిపోదు. అభివృద్ధి 'కల' సాకారం కావాలంటే విత్తం, చిత్తం.. రెండూ కావాలి. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధుల్లో భారీ కోతలు గోచరిస్తున్నాయి. కేంద్ర గ్రాంట్లు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.34,701 కోట్లు లభించగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో 30,333 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేశారు. సవరించిన బడ్జెట్‌లో 21,966 కోట్లకు తగ్గించారు. అంతకంటే తక్కువ 20 వేల కోట్లే వచ్చాయి. ఇక 2025-26 లో 32,234 కోట్లు వస్తాయని అంచనా వేయగా, రెండు త్రైమాసికాలకు కలిపి ఈ ఏడాది సెప్టెంబర్ చివరాఖరికి రాష్ట్రానికి అందినవి కేవలం 4 వేల కోట్లు. అర్నెల్లకు 50 శాతం గ్రాంట్లు రావాల్సి ఉండగా 12 శాతమే వచ్చాయి. కేంద్ర పన్నుల్లో వాటా విషయానికొస్తే 2023-24లో 45,710 కోట్లు అందినట్లు తుదిలెక్కల్లో తేలింది. 2024-25 బడ్జెట్‌లో తొలుత 50,474 కోట్లుగా అంచనా వేసి 52 వేల కోట్లకు సవరించారు. రూ.36,869 కోట్లు వచ్చాయి. ఇంకా తుది లెక్కలు రావాల్సి ఉంది. ఈ ఏడాది 57,566 కోట్లు వస్తాయని అతి అంచనా వేశారు. గతానుభవం రీత్యా అన్నేసి నిధులు కేంద్రం వదులుతుందా అనే సందేహం వస్తుంది.రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరుల్లో కీలకమైనవి కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, పన్నుల్లో వాటా. రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొనే ఆదాయంలో గ్రాంట్లు వాటా 15 శాతం కాగా కేంద్ర పన్నుల్లో వాటా 26 శాతం వరకు ఉంటోంది. వీటిని పూర్తి స్థాయిలో రాష్ట్రానికి ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం బిగబడితే వీళ్లు చెబుతున్న 2047 నాటికి వికసిత భారత్, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలు ఏ విధంగా సిద్ధిస్తాయో ఈ ఆర్థిక మేధావులే సెలవివ్వాలి. కేంద్రం నుంచి నిధులు రాకపోవడం వలన ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఆగిపోతున్నాయి. చివరికి ఉపాధి పనులు చేసిన కూలీలకు వేతనాల పంపిణీ నెలల పర్యంతం నిలిచిపోతోంది. కేంద్రం వైఖరితో రోజువారీ ఖర్చులు, ప్రభుత్వ నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం అప్పులకేసి, ప్రతి మంగళవారం ఆర్‌బిఐకేసి పరిగెత్తాల్సిన దుస్థితి నెలకొంది. రెవెన్యూ లోటు భారీగా పెరుగుతోంది. బడ్జెట్‌లో ఏడాది మొత్తమ్మీద అప్పుల ద్వారా రూ.80 వేల కోట్లు సమీకరించుకోవాలని అంచనా వేయగా అర్థ సంవత్సరంలోనే 63 వేల కోట్ల అప్పులు చేసింది. ఈ వాస్తవాలను కూటమి ప్రభుత్వం రాజకీయ విమర్శలతో కప్పెట్టేందుకు ఎంతగా ప్రయత్నించినా దాగేది కాదు.కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. రాష్ట్రంలో జనసేన, బిజెపి పార్టనర్స్‌గా టిడిపి కూటమి సర్కారే నడుస్తోంది. టిడిపి ఎంపిల మద్దతుపైనే ఎన్‌డిఎ సర్కార్ నిలబడిన పరిస్థితుల్లో ఎందుకు ఆ పార్టీ రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టలేకపోతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. కేంద్ర గ్రాంట్లు, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలు, పన్నుల్లో వాటా నిధులను మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి విదిలిస్తున్నా కూటమి పార్టీలు మౌనం పాటిస్తున్నాయి. కేంద్రం పోలవరానికి పూచీ పడకపోయినా, అమరావతికి బడ్జెట్ నిధులివ్వకుండా రుణాల వైపు ఎగదోసినా, విభజన హామీలపై తొండాట ఆడుతున్నా టిడిపి, జనసేన నోరు మెదపట్లేదు సరి కదా మోడీని, బిజెపిని ఆకాశానికెత్తి భుజకీర్తులు తగిలించడం నమ్మి ఓట్లేసిన ప్రజలను దగా చేయడమే అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయాలంటే విద్యుత్ సంస్కరణలు, ఇతర ఆంక్షలను మోడీ ప్రభుత్వం విధించినా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మారుమాట్లాడడంలేదు. రాష్ట్రాన్ని మొంథా తుపాన్ అతలాకుతలం చేసింది. రూ.6,500 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్రం నివేదిక ఇచ్చింది. తక్షణ సాయంగా 900 కోట్లిమ్మని ప్రాధేయపడింది. అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదు. కేంద్ర బృందాల పర్యటనల తర్వాత ఎంతిస్తుందో ఏమిస్తుందో ఎప్పటికిస్తుందో తెలీదు. బుడమేరు వరదలకు ఎంత అడిగితే ఎంతిచ్చిందో సంవత్సరం దాటినా పజిల్‌గా మిగిలిపోయింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం టిడిపి కూటమి ప్రభుత్వం, ఎంపీలు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు మోడీ సర్కార్‌పై ఒత్తిడి చేసి నిధులు సాధించాలి.

# పిల్లల ఆస్తమాకు కాలుష్యం చిక్కులు

హైదరాబాద్,ప్రపంచ జనాభాలో దాదాపు 30 కోట్ల మంది, భారతదేశంలో 1.5 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. వీరిలో సగానికి సగం పిల్లలే బాధితులు కావడం విశేషం. తెలంగాణలో 18 లక్షల ఆస్తమా కేసులు నమోదు కాగా, వీరిలో పిల్లలే ఎక్కువగా ఉన్నారని అధ్యయనాలు వెల్లడించాయి. ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినప్పటికీ సకాలంలో వైద్యచికిత్స అందించకుంటే ఎన్నోఇబ్బందులు తెచ్చి పెడుతుంది. ఆస్తమాకు వ్యాక్సిన్ అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు. ఫ్లూ వల్ల ఇది ఎక్కువవుతుంది కాబట్టి ఫ్లూ వ్యాక్సిన్ ఉపయోగిస్తే కాస్త ఉపశమనం కలుగుతుంది. ఆస్తమా ఒక ఇన్‌ఫ్లెమేటరీ జబ్బు. ఇన్‌ఫ్లమేషన్ అనేది శరీరంలో ఎక్కువ తక్కువై సహజమైన రక్షణ గుణం తగ్గుతుంది. మన దేశంలో వాయు కాలుష్యం వల్ల ఆస్తమా రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆరోగ్యానికి లేదా పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలతో గాలి కలుషితం కావడమే వాయు కాలుష్యం. గాలిలో ఉండే చిన్న కణాలను పర్టిక్యులేట్ మాటర్ (పిఎం) అంటారు. అతి చిన్న కణాలు (పిఎం 2.5) అత్యంత ప్రమాదకరమైనవి. అవి ఊపిరితిత్తుల్లోకి, రక్తంలోకి లోతుగా చొచ్చుకుపోతాయి. ఆస్తమా ఉన్నవారు ఈ చిన్నకణాలను పీల్చడం వల్ల ఆరోగ్యానికి చిక్కులు ఎక్కువవుతుంటాయి.చిన్నతనంలో వాయు కాలుష్యానికి గురికావడం బాల్యం, కౌమారదశల్లో, ముఖ్యంగా నాలుగేళ్ల తరువాత ఆస్తమా వ్యాప్తి చెందడానికి వీలవుతుంది. శీతాకాలం వచ్చిందంటే ఈ సమస్య మరీ తీవ్రమవుతోంది. శీతాకాలంలో ఢిల్లీ, హర్యా నా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు వాయు కాలుష్యంతో ఎలా అల్లాడిపోతున్నాయో మనకు తెలిసిందే. దేశంలో 70 శాతం కన్నా ఎక్కువ మంది ఇంకా కిరోసిన్, కట్టెల పొయ్యి వాడుతున్నారని, వీటి నుంచి వెలువడే బొగ్గుపులుసు వాయువులతోపాటు అనేక వ్యర్థ వాయువులు శ్వాసకోశాలపై తీవ్రప్రభావం చూపుతున్నాయని అధ్యయనంలో తేలింది. నగరాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతుండడానికి సమీప ప్రాంతాల్లో పంట వ్యర్థాలను మండించడం ఒక కారణం కాగా, వాహనాల నుంచి వెలువడే దుమ్ము, ధూళి కూడా కారణమవుతోంది. వాయు కాలుష్యం మనుషులకు ఊపిరి సలపనీయడం లేదు. అభివృద్ధి పనుల పేరిట రోడ్లు విస్తరించడం, చెట్లను నరికివేయడం, నదులు, వాగులు పూడ్చుకుపోవడం ఇవన్నీ పర్యావరణ సమతుల్యానికి హాని కలిగిస్తున్నాయి.దీంతో కాలుష్యాలు అనేకరూపాల్లో కమ్ముకుంటున్నాయి. ఆస్తమా, గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు మరింత పెరుగుతోంది. ఆస్తమా ఊపిరి తిత్తులకు సంబంధించిన వ్యాధి. దీని బారినపడిన వారిలో ఛాతీ బిగుసుకుపోవడం, ఊపిరితిత్తులు మూసుకుపోవడం, శ్వాసతీసుకోవడం కష్టం కావడం, విపరీతంగా దగ్గురావడం తదితర లక్షణాలు సంక్రమిస్తుంటాయి. ఛాతీ లో అధికంగా శ్లేష్మం చేరడం వల్ల గాలి మార్గాలు మూసుకుపోయి శ్వాసతీసుకోవడం ఇబ్బంది అవుతుంది. శ్లేష్మం ఎక్కువైతే న్యూమోనియా వంటి ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తుంది. వేసవికాలంలో ఆహారం విషయంలో నిర్లక్షంగా ఉంటే ఈ సమస్య మరింత తీవ్రమౌతుంది. శ్లేష్మం ఉత్పత్తి ఎక్కువై శ్వాసనాళాల్లో వాపువస్తుంది. అప్పటికే క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ వంటి వ్యాధులతో



బాధపడుతున్నట్టయితే శ్లేష్మ సమస్య కలిగించని ఆహారాన్ని తీసుకోవాలి. పాలు తీసుకోరాదు. దీనివల్ల సమస్యలు పెరుగుతాయి. శ్లేష్మం ఎక్కువగా ఉంటే తేనెను తీసుకోవడం మంచిది. దగ్గు నుండి ఉపశమనం లభిస్తుంది.తేనెతోపాటు నిమ్మకాయ తీసుకుంటే ఔషధంగా పనిచేస్తుంది. పసుపు రసాన్ని గోరు వెచ్చని నీటిలో కలిపి పుక్కలించుకోవచ్చు. వేడి నీళ్లు, చికెన్ సూప్, వేడి యాపిల్ రసం, గ్రీన్‌టీ తీసుకోవచ్చు. పిల్లల్లో వచ్చే ఆస్తమాపై తరచుగా అధ్యయనాలు జరుగుతున్నాయి. చేపలు తినడంవల్ల ఆస్తమాను నివారించవచ్చని హ్యూమన్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ అనే జర్నల్‌లో ఓ అధ్యయనం వెలువడింది. ఈ అధ్యయనంలో ఆస్తమా పిల్లలకు ఆరు నెలలపాటు రోజూ చేపల కూర తినిపించారు. ఇలా చేయడం వల్ల ఆస్తమా తగ్గుముఖం పడుతోందని కనుక్కొన్నారు. చేపల్లో ఒమెగా 3ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి.అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉంటాయి. అందువల్ల ఊపిరితిత్తుల్లో వచ్చే వాపు తగ్గుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వారంలో రెండు సార్లయినా చేపలు తింటేశ్వాసకోశ వ్యాధులు దూరమవుతాయని చెబుతున్నారు. వంశపారంపర్యంగా కూడా ఈ వ్యాధి సంక్రమించే పరిస్థితి ఉంది. వాతావరణంలో మార్పులు, పొగ, దుమ్ముతో నిండిన పరికరాలు, అగరుబత్తీ పరిమళాలు, దోమల నివారణకు వాడే కాయిల్స్, పెంపుడు జంతువుల బొచ్చు, టపాసుల పొగ, పూల పుప్పొడి, ఇవన్నీ ఆస్తమాకు దోహదం చేస్తుంటాయి. ఒకప్పుడు వంశవారసత్వంగా ఆస్తమా వస్తుందని నమ్మేవారు. కానీ ఇప్పుడు దానికంటే గాలి కలుషితం కావడం ప్రధాన కారణమవుతోంది. ఆస్తమా రోగులకు ధూమపానం పనికి రాదు. శీతల పానీయాలు, ఐస్‌క్రీములు, ఫ్రిజ్ వాటర్ వంటి చల్లని పదార్థాలు తీసుకోకూడదు. ఇంట్లో బూజు దులపడం, చెత్తను తీయడం, పాతసామాన్లు చక్కబెట్టడం ఇలాంటి పనులు చేస్తే అలర్జీ పెరిగి ఆస్తమా ఎక్కువవుతుంది. ఇన్‌హేలర్ దగ్గర ఉంచుకోవడం మంచిది. నిత్యం వ్యాయామం చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. బరువు తగ్గుతుంది. బరువు తగ్గితే ఆస్తమా రిస్క్ తగ్గుతుంది. రక్తప్రసరణవల్ల అవయవాలన్నిటికీ ఆక్సిజన్ సరఫరా అయి మరింత శక్తి లభిస్తుంది. యోగా, ప్రాణాయామం కూడా ఆస్తమా రోగులకు మంచిదే.

# హస్తం హవానా.. కారు జోరా?



హైదరాబాద్,జూబ్లీహిల్స్ కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్నా ఆయన తెచ్చిన నిధులేమీ లేవని, కిషన్ రెడ్డి, కెసిఆర్ అభివృద్ధి నిరోధకులని రేవంత్ ధ్వజమెత్తారు. కేంద్రం 2014- 23 మధ్య తెలంగాణకు 9 లక్షల కోట్ల నిధులిచ్చిందని, సిఎం అసత్య ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక హైడ్రా పేరుతో ఇళ్లు కూలగొట్టడం మినహా పేదలకు చేసిందే లేదని కెటిఆర్ విమర్శించగా, చెరువుల ఆక్రమణలు తొలగించి నీటివనరులను అభివృద్ధి పరుస్తున్నా మని, మూసీ ఆక్రమణలు తొలగించి నగరాన్ని నందనవనం చేస్తుంటే కెటిఆర్, హరీశ్ సహించలేకపోతున్నారని సిఎం విమర్శించారు.సిఎం రేవంత్, కెసిఆర్‌ల ప్రతిష్ఠకు అగ్నిపరీక్ష. హైదరాబాద్ మహానగర పరిధిలోని జూబ్లీహిల్స్ శాసనసభా స్థానానికి 11న జరిగే ఉపఎన్నిక ప్రచారం పూర్తయి, పోలింగ్‌కు సర్వం సిద్ధంగా ఉంది. బిజెపితో సహా 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ విజయసాధనకు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిఆర్‌ఎస్ అధినేత, మాజీముఖ్యమంత్రి కెసిఆర్‌ల ప్రతిష్ఠకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అగ్నిపరీక్షగా నిలిచింది. జూబ్లీహిల్స్ స్థానానికి 3 సార్లు ప్రాతినిధ్యం వహించిన నాయకుడు మాగంటి గోపీనాథ్ ఆకస్మికంగా మరణించడంతో జరుగుతున్న ఉపఎన్నికలో గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకిదింపి సానుభూతి ఓట్లతో మళ్ళీ గెలవాలని భారత రాష్ట్రసమితి గట్టి ప్రయత్నాలే చేస్తున్నది.ఈ సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకుని తదుపరి జరిగే అసెంబ్లీ ఎన్నికలలో సత్తా చాటి, కెసిఆర్‌ను మళ్లీ సిఎంగా తేవాలనే వ్యూహంతో బిఆర్‌ఎస్ శ్రమిస్తోంది. కెటిఆర్, హరీశ్‌రావు పలువురు మాజీమంత్రులు, శాసనసభ్యులు, స్థానిక నేతలను వీరేంటబెట్టుకుని ర్యాలీలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం చేశారు. నియోజక వర్గంలోని శ్రీనాగరకాలనీ, బోరబండ, వెంగళరావునగర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, 7 కార్పొరేట్ డివిజన్లలోని బస్తీలు, మురికివాడలు, ప్రధాన రహదారులలో బిఆర్‌ఎస్ మాజీమంత్రులు, శాసనసభ్యులు సిహెచ్ మల్లారెడ్డి, ఎస్. నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివేకానంద గౌడ్ ప్రభృతులు గల్లీగల్లీలో ఇంటింటికీ తిరిగి కారుగుర్తుకు ఓటేసి కెసిఆర్ ప్రభుత్వాన్ని మళ్ళీ తెచ్చుకోవాలని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ బిసి సాధికారత నినాదంతో యువకుడు, శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్‌ను హస్తం అభ్యర్థిగా పోటీకి దింపి గెలుపుకోసం చెమటోడుస్తోంది.తెలంగాణ మంత్రు లు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు సహా మంత్రులు, పిసిసి అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ వంటి నేతలే గాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికను వ్యక్తిగత ప్రతిష్ఠగా తీసుకుని వివిధ డివిజన్‌లలో విస్తృతంగా ప్రచారం చేశారు. దాదాపు 4 లక్షల ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్‌లో లక్షా 1.4 లక్షల బిసి, లక్ష ముస్లిం, 20 వేలు క్రైస్తవ ఓటర్లున్నారు. నిజానికి ఈ స్థానం మినీ భారత్. ఉత్తరాది వారుతెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రధాన సామాజిక వర్గాల వారూ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సంఖ్యలో వున్నారు. ఈ ఎన్నిక మోడీ, కెసిఆర్ ద్వయానికి, రేవంత్, రాహుల్, ఒవైసిల మధ్య జరుగుతున్న పోరుగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. నియోజకవర్గంలో గణనీయంగా ఉన్న ముస్లింలను ఆకట్టుకోవడానికి కొద్దిరోజుల ముందే క్రికెట్ ఆటగాడు అజారుద్దీన్‌కు మంత్రిపదవి ఇచ్చి మైనారిటీ వ్యవహారాల శాఖను కట్టబెట్టారు. మజ్లిస్ పార్టీ పోటీ చేయకుండా ఈసారి హస్తం పార్టీకి మద్దతు ప్రకటించడం విశేషం. కెసిఆర్ ప్రభుత్వం మైనారిటీలను నిర్లక్ష్యం చేసిందని, ముస్లిం రిజర్వేషన్లను 4 నుండి 12 శాతానికి పెంచుతామని చెప్పి మోసం చేశారని మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తోందని, పదేళ్ల తర్వాత కొత్తకార్డులను ఇచ్చిందని, ఇళ్లకు ఉచిత కరెంటు, రూ. 500 కే వంట గ్యాస్ సరఫరా చేస్తోందని చెబుతూ, జూబ్లీహిల్స్‌లో గెలిస్తే మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓటర్లకు హామీ ఇచ్చారు. కెసిఆర్ ప్రభుత్వం వేలకోట్లు కొల్లగొట్టి యువతకు ఉద్యోగ, ఉపాధిని నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేసి ఆదుకున్నామని, రానున్న కాలంలో మరిన్ని పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని సిఎం భరోసా ఇచ్చారు. పార్లమెంటులో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కీలక బిల్లులకు బిఆర్‌ఎస్ ఎంపిలు మద్దతు పలకడం చూస్తే కెసిర్ మోడీకి నమ్మకమైన మిత్రుడుగా ఉన్న సంగతి తెలుస్తోందని, అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్‌కు ఎటిఎంగా ఉందని గతంలో ఆరోపించిన మోడీకి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ. లక్ష కోట్ల అవినీతి జరిగిందని తెలిసినా, రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణ జరిపి, సిబిఐ, ఇడిలతో విచారణ జరిపించాలని శాసనసభ తీర్మానించి కేంద్రానికి పంపినా, ఇకారురేస్‌లో అవినీతి జరిగినా మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, కారుగుర్తుకు ఓటేస్తే కమలానికి ఓటేసినట్లేనని రేవంత్ అన్నారు.కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్ అని ముస్లింల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇది ముస్లింలను బుజ్జగించడమేనని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరరావు స్పందించారు. బిజెపి నేతలు కమలం గుర్తుకు ఓటేయాలని వారు కోరారు. జూబ్లీహిల్స్ కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్నా ఆయన తెచ్చిన నిధులేమీ లేవని, కిషన్ రెడ్డి, కెసిఆర్ అభివృద్ధి నిరోధకులని రేవంత్ ధ్వజమెత్తారు. కేంద్రం 2014- 23 మధ్య తెలంగాణకు 9 లక్షల కోట్ల నిధులిచ్చిందని, సిఎం అసత్య ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక హైడ్రా పేరుతో ఇళ్లు కూలగొట్టడం మినహా పేదలకు చేసిందే లేదని కెటిఆర్ విమర్శించగా, చెరువుల ఆక్రమణలు తొలగించి నీటివనరులను అభివృద్ధి పరుస్తున్నామని, మూసీ ఆక్రమణలు తొలగించి నగరాన్ని నందనవనం చేస్తుంటే కెటిఆర్, హరీశ్ సహించలేకపోతున్నారని సిఎం విమర్శించారు. బోరబండ చౌరస్తాలో పిజెఆర్ విగ్రహం, అమీర్ పేట మైత్రీవనం కూడలిలో తెలుగుతేజం ఎన్‌టిఆర్ విగ్రహం నెలకొల్పుతామని హామీ ఇచ్చి రేవంత్ వారి మన్ననలు పొందారు.జూబ్లీహిల్స్‌లో ఆధునిక ఐటిఐ, మహిళా కళాశాల నెలకొల్పుతామని, మరెన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతామని చెబుతూ ఎలాగైనా హస్తం పార్టీ గెలుపుసాధించి తీరాలనే పట్టుదలతో సిఎం ప్రచారం సాగించారు. జూబ్లీహిల్స్‌లో సంపన్న వర్గాలు ఉన్నా పేద, మధ్య తరగతి వారే అధికం. బస్తీలు, మురికివాడలలో పారిశుద్ధ్య, మంచినీటి సరఫరా సరిగాలేకపోవడం, మురుగునీటి పారుదల సరిగాలేక నీరు రోడ్లపైకి రావడం, రోడ్లు గండ్లుపడి అధ్వానంగా, దుర్గంధం వేదజల్లడం ప్రజలను పీడిస్తున్న ప్రధాన సమస్యలు. రూ. 500 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తయితే సమస్యలు తీరుతాయని

# డాక్టర్ ఉమర్ సూత్రధారిగా గుర్తింపు

న్యూఢిల్లీ, ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనకు చెందిన దర్యాప్తు కొనసాగుతున్నది. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ ఎలా ఆ కారును పేల్చి ఉంటాడని ఆరా తీస్తున్నారు. అయితే అమోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్‌ను వాడడం వల్లే భారీ స్థాయిలో పేలుడు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. హై ఇంటెన్సిటీ బ్లాస్ట్‌కు ఏఎన్ఎఫ్‌వోనే కారణం కావొచ్చు అని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే పేలుడు ఘటన జరిగిన సమీపంలో అమోనియం నైట్రేట్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ అధికారులు గుర్తించారు. ఫిదాయిన్ తరహాలో ఆత్మహుతి దాడికి పాల్పడ్డాడు. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌లో డాక్టర్ ఉమర్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ సిటీలోని పలు ప్రదేశాల నుంచి సుమారు 2900 కేజీల ఆర్డీఎక్స్‌ను సోమవారం రికవరీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎర్రకోట్ సమీపంలో కారు పేలిన సమయంలో.. దాంట్లో ఉమర్ ఒక్కడే ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అమోనియం నైట్రేట్ చాలా శక్తివంతమైన పేలుడు పదార్థాం. దీన్ని సాధారణంగా పరిశ్రమ పేలుళ్లకు వినియోగిస్తుంటారు. గతంలో ఉగ్రవాదులు పలుమార్లు ఈ రసాయనాన్ని వాడారు. ఐఈడీల్లో దీన్ని వినియోగించినట్లు తెలుస్తున్నది. శక్తివంతమైన పేలుడు ధాటికి పలు మీటర్ల దూరంలో ఉన్న వాహనాల అద్దాలు కూడా పగిలిపోయాయి. చాలా దూరంలో ఉన్న బిల్డింగ్‌ల్లోనూ ఆ శబ్దం వినిపించింది. టెర్రర్ మాడ్యూల్‌తో లింకున్న ఇద్దరు డాక్టర్లను పట్టుకోవడంతో.. భయాందోళనకు గురైన డాక్టర్ ఉమర్ ఈ పేలుడుకు పాల్పడి ఉంటాడని అంచనా వేస్తున్నారు.

# ప్రధాన నగరాల్లో నిఘా కట్టుదిట్టం

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీ బాంబు పేలుడుతో కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు దేశంలో హైఅలర్ట్ ప్రకటించింది. ఢిల్లీ సహా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్, బీహార్ సహా పలు రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో భద్రతా దళాలు నిఘాను పెంచాయి.అంతేకాదు దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మూడు రోజులపాటూ విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ కొనసాగనుంది. ప్రతి ఒక్క ప్రయాణికుడినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ పార్కింగ్‌పైనా దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలతో అన్ని రాష్ట్రాల్లోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఎయిర్‌పోర్ట్స్ మాత్రమే కాకుండా బస్టాండ్స్, ప్రభుత్వ కార్యాలయాలూ, రద్దీ ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు దేశ సరిహద్దుల్లోనూ హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశరాజధాని ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది. చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 9 మంది దుర్మరణం పాలవ్వగా, 20 మందికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్లు, ఎయిర్‌పోర్ట్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన మార్కెట్లలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు తాజా ఘటనతో లాల్ ఖిలా మెట్రో స్టేషన్ ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా లాల్ ఖిలా మెట్రో స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. మరోవైపు దాడి ఘటనపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్, ఎన్‌సీజీ, ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెట్రో స్టేషన్ సమీపంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు.

# భారీ ప్లాన్ లో జగన్...

అమరావతి,వైసీపీ అధినేత వైఎస్ జగన్ భారీ ప్లాన్ లో ఉన్నారా. పార్టీ గ్రాఫ్ ని అలా ఇంచి ఇంచి పెంచుకుంటూ పోవాలని చూస్తున్నారా అంటే జరుగుతున్న పరిణామాలు అదే నిజం అంటున్నాయి. జగన్ ఇంకో రెండు నెలలలో పూర్తి స్థాయిలో జనంలోకి వస్తాయని అంటున్నారు. అన్నీ అనుకూలిస్తే కొత్త ఏడాది 2026 సంక్రాంతి తరువాత జగన్ మార్క్ యాక్షన్ ప్లాన్ తో రంగంలోకి దిగుతారు అని అంటున్నారు.

బస్సు యాత్ర ముందు :

ఇక జగన్ బస్సు యాత్రతో ప్రజల వద్దకు రావాలని చూస్తున్నారు. ఏపీలో 26 పార్లమెంట్ సీట్లు ఉన్నారు. అలా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో జగన్ బస్సు యాత్ర చేస్తారని పార్టీ పరిస్థితిని సమీక్షించుకుంటూ వీలున్న చోటల్లా జనాలతో కనెక్ట్ అవ్తూఅరు అని అంటున్నారు. ఈ విధంగా వరానికి నాలుగైదు రోజుల పాటు ఆయన పార్లమెంట్ నియోజకవర్గంలో బస్సు ద్వారా పర్యటిస్తారు అని అంటున్నారు. పార్టీ గ్రౌండ్ లెవెల్ లో ఎలా ఉంది, నాయకుల పనితీరు ఏమిటి క్యాడర్ మనో భావాలు ఎలా ఉన్నాయి. ప్రత్యర్థి పార్టీల బలాలు బలహీనతలు ఏమిటి అన్నది కూడా జగన్ పూర్తిగా స్వయంగా అధ్యయనం చేస్తారు అని అంటున్నారు.

ప్లీనరీతో దూకుడు :

ఇక వైసీపీ ప్లీనరీని కూడా 2026లో ఘనంగా నిర్వహిస్తారు అని అంటున్నారు. జూలైలో వైఎస్సార్ జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు జరుగుతుంది అని అంటున్నారు. 2022 జూలైలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఎంతో గొప్పగా ప్లీనరీ సాగింది. ఆ తరువాత మళ్ళీ నిర్వహించినది లేదు. అయితే ఈసారి ప్రతిపక్షంలో ఉండడంతో క్యాడర్ లో ఊపు తీసుకుని వచ్చేందుకు బ్రహ్మాండంగా నిర్వహించాలని జగన్ చూస్తున్నారు అని అంటున్నారు.

పాదయాత్ర కోసమే :

ఇక జగన్ పాదయాత్రను 2027లో ప్రారంభిస్తారు అని అంటున్నారు. దనికి సంబంధించిన విషయాలను కూడా ప్లీనరీలో చర్చిస్తారు అని అంటున్నారు ఆ మీదట ఏకంగా అయిదు వేల కిలోమీటర్లతో భారీ పాదయాత్రకు జగన్ శ్రీకారం చుడతారు అని అంటున్నారు. ఈసారి రెండేళ్లకు పైగా పాదయాత్ర సాగుతుందని 2029 ఎన్నికలకు ఈ పాదయాత్ర ఒక బూస్ట్ గా పనిచేస్తుందని జగన్ నమ్ముతున్నారు.

బూత్ లెవెల్ నుంచి :

ఇక పార్టీని ముందు పటిష్టం చేయడం కోసం జగన్ చూస్తున్నారు. బూత్ లెవెల్ నుంచి రాష్ట్రంలో పార్టీ అత్యున్నత వేదిక అయిన పీఏసీ దాకా పార్టీకి కొత్త నాయకత్వాన్ని యువ నాయకత్వాన్ని ఇవ్వాలని జగన్ భావిస్తున్నారు అని అంటున్నారు. సీనియర్ల సేవలను ఉపయోగించుకుంటూనే పార్టీలో యంగ్ బ్లడ్ ని తీసుకుని రావాలని చూస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీలో ఇన్నాళ్ళూ సాగుతున్న సైలెంట్ కి చెక్ పెడుతూ 2026 లో జగన్ బస్సు దూసుకుని వస్తుందని అంటున్నారు. చూడాలి మరి

# రాజేంద్రనగర్‌లో మొయినుద్దీన్ అరెస్ట్

హైదరాబాద్,అరెస్టైన ఉగ్రవాది డాక్టర్ మొయినుద్దీన్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుజరాత్ ఏటీఎస్ బృందం రాజేంద్రనగర్ ప్రాంతంలో సయ్యద్ మొయినుద్దీన్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో కీలక సమాచారం బయటకు వచ్చినట్టు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, మొయినుద్దీన్ భారీ స్థాయిలో విషప్రయోగం చేసి చంపాలని కుట్ర పన్నినట్లు వెల్లడైంది.

# తనిఖీ సరే, బోధన ఎలా!

## మొంథా తుఫాన్ సమయంలో మంత్రుల పర్యవేక్షణ

అమరావతి,మొంథా తుఫాను సమయంలో క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసినందుకు మంత్రులను సీఎం చంద్రబాబు అభినందించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం సందర్భంగా వారిని అభినందించారు. ప్రతీ మంత్రి స్వయంగా ప్రాంతాల్లో ఉండి ప్రజలకు వేగంగా సహాయం అందేలా చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. మొంథా తుఫాను సమయంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయక చర్యలు అత్యంత వేగంగా జరిగాయని తెలిపారు సీఎం చంద్రబాబు. ఆర్టీజీ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ, టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంత్రులు, అధికారులు టీం స్పిరిట్‌తో పనిచేయడం ఈ ఫలితాలకు ప్రధాన కారణమని చంద్రబాబు పేర్కొన్నారు. తుఫాను సమయంలో అందరూ ఎలా కష్టపడ్డారో తాను ప్రత్యక్షంగా గమనించినట్లు వెల్లడించారు.

## వణికిస్తున్న చలి... పులి

హైదరాబాద్,మొన్నటి వరకు అయితే భానుడి భగభగలు.. లేదంటే వరుణుడి ఉరుములతో తెలుగు రాష్ట్రాల ప్రజలకు చుక్కలు కనిపించాయి. ఇప్పుడు నా వంతు అంటూ చలిగాలులు ఎంట్రీ ఇచ్చాయి. ఇప్పుడు ప్రజలను ఈ గాలులు వణికిస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. జస్ట్ రెండు, మూడు రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు.. 10 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పడిపోయాయి. అయితే ఇది కాదు.. అసలు కథ ముందుంది అంటోంది వాతావరణశాఖ. రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు. వాతావరణశాఖ విడుదల చేసిన లేటెస్ట్ లెక్కల ప్రకారంఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పలు ప్రాంతాల్లో 5 నుంచి 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రెండు జిల్లాల్లో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు ఈ స్థాయికి పడిపోవడంతో ఉదయం కూడా దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటోంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే కనిష్ట ఉష్ణోగ్రతలు 18–20 డిగ్రీల నుంచి 9–13 డిగ్రీల మధ్యకు చేరుకున్నాయి. అయితే, రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత మరింత పెరుగుతుంది. అవును.. నవంబర్ 11–19 తేదీల వరకు అనగా రాబోయే పది రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉండనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ముఖ్యంగా 13–17 తేదీల మధ్య మరింత అధికంగా ఉంటుందని, కొన్ని జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ అంటే పది డిగ్రీల లోపు పడిపోనున్నాయని హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, విజయనగరం, వైఎస్సార్ కడప, ప్రకాశం, అనకాపల్లి, నంద్యాల, పార్వతీపురం మన్యం, పల్నాడు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15 నుంచి 20 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి.రాబోయే పది రోజుల్లో చాలా జిల్లాల్లో రాత్రి పూట ఉ ష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు అధికారులు. ముఖ్యంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు అధికారులు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా 30 డిగ్రీల వరకే నమోదవుతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండటంతో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.ఉత్తర భారతదేశంలో ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఇప్పటికే మంచు వర్షం ప్రారంభమైంది. యూపీ, ఢిల్లీ, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో కూడా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రాజస్థాన్‌లో కూడా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో కోల్డ్ వేవ్ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తెలిపారు. చాలా రాష్ట్రాల్లో తెల్లవారుజామున పొగమంచు కురుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న ప్రజలకు.. ఇప్పుడు చలి కూడా తోడైంది. రాత్రి, తెల్లవారుజాము దట్టమైన పొగమంచు వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఇక హిమాచల్, ఉ త్తరాఖండ్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పటికే మంచు కురవడం ప్రారంభమైంది. ఇది ఊహించిన దానికంటే చాలా ముందు సమయం అంటున్నారు అధికారులు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. ఈ సారి రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు. మరోవైపు నవంబర్ 11 నుండి 19 వరకు (ప్రధానంగా 13 నుండి 17 నవంబర్ వరకు) 8–10 రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు సమీపంలోని దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు చలి, ఉష్ణోగ్రతలు 14°C -17°C మధ్య ఉ ండవచ్చును.. సాధారణంగా ఇంత దీర్ఘకాలం చలి తీవ్రత తరచుగా ఉండదు, కానీ ఈ సంవత్సరం 8–10 రోజుల పాటు తీవ్రమైన చలి వాతావరణం ఉండబోతోందని పేర్కొన్నారు

## నష్టాన్ని అంచనా వేసిన అధికారులు

అమరావతి, మొంథా తుఫాను నష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కేంద్ర బృందం కలిసింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి పాసుమీ బసు నేతృత్వంలో సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రితో కేంద్ర బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టాన్ని అంచనా వేసింది. కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాలను సందర్శించింది. రూ.5,267 కోట్ల మేర తుఫాను నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. తక్షణ సాయంగా రూ.2,622 కోట్లను మంజూరు చేయాలని కేంద్రాన్ని సర్కార్ కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా 443 మండలాల్లోని 3,109 గ్రామాలు మొంథా తుఫాను కారణంగా ప్రభావితం అయ్యాయని కూటమి ప్రభుత్వం పేర్కొంది. దాదాపు 10 లక్షల మంది తుఫాను, భారీ వర్షాల కు ప్రభావితం అయ్యారని నివేదికలో వెల్లడించింది. 9960 ఇళ్లు నీట మునిగాయని, 1.11 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారని సర్కార్ పేర్కొంది. తుఫానుతో పాటు భారీ వర్షం కారణంగా 4566 ఇళ్లు దెబ్బతిన్నాయని స్పష్టం చేసింది. దాదాపు 1.61 లక్షల హెక్టార్లలో పంట దెబ్బతిందని.. 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారని కేంద్రానికి నివేదించింది. వ్యవసాయ పంటలతో పాటు ఆక్వా, పశుసంవర్ధక, చేనేత రంగం కూడా తీవ్రంగా నష్టపోయినట్టు వెల్లడించింది. 794 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, 12,856 విద్యుత్ స్తంభాలు నేల కూలినట్టు స్పష్టం చేసింది. అలాగే 2,318 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయని నివేదికలో పేర్కొంది. మొంథా తుఫాను కారణంగా పంటలు, రహదారులు, ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలకు రూ.6,384 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించింది. తుఫాను వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు 22 జిల్లాల్లో 1.92 లక్షల మందికి రిలీఫ్ క్యాంపులకు తరలించామని వెల్లడించింది. 3.36 లక్షల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయంగా అందించినట్టు కేంద్ర బృందానికి ప్రభుత్వం తెలియజేసింది.

హైదరాబాద్,ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు శాశ్వతంగా తనిఖీ బృందాలు నియమించాలని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. సుమారు 24 వేలపైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి 299 కమిటీలువేసి వాటిలో పాఠశాలల్లో బోధించి కనీసంగా పదేళ్ళ బోధనానుభవం కలవారిని శాశ్వతంగా తనిఖీ బృందాలుగా నియమిస్తారు. 16,474 ప్రాథమిక పాఠశాలల తనిఖీకి 504 మంది ఉపాధ్యాయులతో 168 తనిఖీ బృందాలు, 3,100 మాధ్యమిక పాఠశాలలకు 105 మంది ఉపాధ్యాయులను 35 బృందాలుగా, 4,672 ఉన్నత పాఠశాల పర్యవేక్షణకు 864 మంది ఉపాధ్యాయులతో 96 పర్యవేక్షణా బృందాలు వెరసి 1473 మంది ఉపాధ్యాయులు శాశ్వతంగా మానెటరింగ్ ప్రక్రియలో వినియోగం చేస్తారు. ఇక ఈ తనిఖీ బృందాలలో నియమితులైన వారెవరూ ఇంకా వారివారి పాఠశాలల కెళ్ళి పాఠాలు చెప్పవలసిన పనిలేదు. అంటే 1473 పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనా సేవలు ఇంకా అందవని అర్థం.ఇక గత ముప్పైఏళ్ళుగా పాఠశాలల తనిఖీ అధికారులు అయిన మండల విద్యాశాఖ్య అధికారులు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ పోస్టులు నింపకుండా విద్యాశాఖ చోద్యం చూస్తా ఉంది. అత్యంత కీలకమైన ఈ పాఠశాల తనిఖీ అధికారులు పోస్టులు నింపకపోగా తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌ఛార్జీలను వేసి చేతులు దులుపుకుంటున్నారు. నియమించిన ఈ తనిఖీ అధికారులు ఎప్పటిదాకా ఉంటారో, పోస్టు ఎప్పుడు ఊడుతుందో తెలియని స్థితిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో 634 మండల విద్యాశాఖ అధికారులు, 70 మంది జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, 33 మంది జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీకి అధికారికంగా ఉండగా, తాజాగా ఈ నియామకాల వల్ల విద్యాశాఖ సాధించేది ఏమీ ఉండదు? ఇంతకు ముందు అనుభవాలు మనకు ఉండనే ఉన్నాయి. సర్వశిక్షా అభియాన్ నేతృత్వంలో ఓ 30 ఏళ్ళ క్రితం మండల విద్యా వనరుల కేంద్రంలో ముగ్గురు ఉపాధ్యాయులు బృందాలను మండల రీసోర్స్ పర్సన్ లుగా నియమించి ఓ దశాబ్దం పాటు ప్రయోగం చేశారు. ఈ రీసోర్స్ పర్సన్ల నియామకం వలన ఎలాంటి అదనపు ప్రయోజనం చేకూరే లేదని, పైగా ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని తిరిగి వారందరినీ వారివారి పాఠశాలలకు పంపించి వేశారు. తనిఖీ బృందాలలో నియమితులైన వీరు ఉద్యోగ ధర్మం కంటే సొంతపనులపై తిరిగారనే విమర్శలు ఉన్నాయి. కొందరైతే సొంత వ్యాపారాలు ప్రారంభించారు.మరికొందరు ఉద్యోగ ధర్మం నిర్వర్తించాల్సిన సమయంలో సొంత పనులు చక్కబెట్టుకున్నానే ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే విద్యాహక్కు చట్టం -2009 వచ్చిన తర్వాత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతృత్వంలో ఒక సబ్జెక్టు నిపుణుల బృందంను వారంలో ఒకరోజు ఇతర పాఠశాలల తనిఖీకి వాడుకున్నారు. అయితే ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడుతుంది అన్న ఉద్దేశంతో ఈ విధానానికి కూడా మంగళం పాడారు. గత అనుభవాలు ఉండికూడా ఇప్పుడు మళ్ళీ అదే ప్రయోగం చేయడం వలన విఫల ప్రయోగం కాదా? తెలంగాణ విద్యా శాఖ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. పైగా ఈ తనిఖీ బృందాలు నియామకం వలన మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ ఉప అధికారులకు ప్రత్యామ్నాయంగా మరో అధికార కేంద్రం అనధికారికంగా పెట్టారనే భావన, పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులు తమ తోటి ఉపాధ్యాయులే, సమాన హెూదాలో తమను తనిఖీ చేయడం ఏమిటి? అనే ఒక రకమైన ఆత్మనూన్యతకు గురయ్యేఅవకాశం ఉంది.ఇక తనిఖీ బృందాలకు టిఎ, డిఎల కోసం లక్షల రూపాయలు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇంతచేస్తే చివరకు 60 శాతం విద్యార్థులు చదువుతున్న ప్రైవేటు పాఠశాలలు తనిఖీకి వీరికి అధికారం కల్పిస్తారా? లేదా? కేవలం 40 శాతం పిల్లలున్న ప్రభుత్వ పాఠశాలకే ఈ తనిఖీలను పరిమితం చేస్తారా? ఇలా చేసినట్లైతే



అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ నియంత్రణ కనీసంగా లేని ప్రైవేటు పాఠశాల మానెటరింగ్‌కు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రైవేటు పాఠశాలల ప్రక్షాళన, నియంత్రణ అవసరం లేదా? అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన, కేవలం గణితం, సైన్స్ తప్ప మరో సబ్జెక్టుపై బోధన కేంద్రీకరించలేని ప్రైవేటు పాఠశాల తనిఖీ బాధ్యత ఎవరు చేపట్టాలి? ఇక విద్యాహక్కు చట్టం -2009 లోని నిబంధన 19 (1)హెచ్ ననుసరించి 2010 ఏప్రిల్ నుండి మన పరీక్షా విధానం సమూలమైన మార్పుకు గురైంది.సులభతరమైన, ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంలో తనిఖీ అధికారులు అవసరం లేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తరగతి గది మధ్య ఎప్పటికప్పుడు అత్యంత సులభతరంగా ఈ పరీక్షలు కొనసాగుతాయి. ఈ పునశ్చరణ అనుభవం నుండే అటు ఉపాధ్యాయుడు తన బోధనా అనుభవాలు స్థిరీకరణ జరుగుతుంది. మరోవైపు విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు సరిదిద్దుకొంటారు. ఎందుకో మన తెలంగాణ విద్యాశాఖ ఇసిసిఇ విధానాన్ని జీర్ణించుకున్నట్లు కనిపించడంలేదు. అందుకు తాజా ఉదాహరణ గత దశాబ్ద కాలంగా నడుస్తున్న పదవ తరగతి పరీక్షలలో గ్రేడులకు బదులు తిరిగి మార్కులు ప్రవేశపెట్టడం. తరగతి గది మూల్యాంకనం ప్రక్రియ అయిన నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం అవుతుంది. పరీక్షలను చట్టబద్ధ స్థితి నుంచి ప్రైవేటు విద్యా సంస్థలు మెప్పు కోసం గ్రేడుల నుండి మార్కుల వైపు మొగ్గు చూపిన వైనం స్పష్టంగా కనపడుతుంది. గతంలో మండల రీసోర్స్ పర్సన్ల నియామకాలు వలన తేలింది ఏమంటే చాలా చోట్ల ఎంఆర్‌పిలు తమ విధులు విస్మరించి సొంత పనుల వైపు మొగ్గారు.విద్యాశాఖ అధికారులకు దళారీ వ్యవస్థగా పని చేశారు. పాఠశాలలు తనిఖీలు చేయాల్సిన వీరు కాగితాలు స్వీకరించి, కాకి లెక్కలు, గణాంకాలు, నివేదికలు స్వీకరించే పరిస్థితి మాత్రమే ఉండేది. ఆ కాగితాలు కంప్యూటర్ కెక్కించడంపై సమీక్షలు తప్ప ఎలాంటి ప్రయోజనం ఒనగూడలేదు! కనుక తెలంగాణ విద్యాశాఖ పెద్ద సంఖ్యలో శాశ్వతంగా మానెటరింగ్ జట్టును నిర్మించేటప్పుడు గత అనుభవాలను తప్పనిసరిగా సమీక్షించుకోవాలసిన అవసరం ఉంది. తనిఖీ అధికారులు ఏర్పరిచే ముందు నమోదు క్షీణించిపోతున్న ప్రభుత్వ బడుల సంస్కరణ, పునర్వ్యవస్థీకరణ వైపు దృష్టి పెట్టడంతోపాటు, ప్రైవేటు పాఠశాలల వనరులలోపం, నిబంధనలు ఉ ల్లంఘన, ఫీజుల క్రమబద్ధీకరణ తదితర విషయాలు తనిఖీ చేసి చక్కదిద్దాల్సిన బాధ్యత విద్యాశాఖ పైన ఉంది.

### ఎర్రకోట బంద్

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు సందర్శకులకు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు.

## 'మిట్టల్'కు రాయితీలు -నిర్వాసితులపై నిర్బంధాలు




అమరావతి,విశాఖ నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం విపరీత ప్రచారం చేసుకుంటోంది. తానోదే చేయబోతున్నట్లు నమ్మించే ప్రయత్నం చేస్తోంది. పెట్టుబడులు వరదలా ప్రవహిస్తున్నాయని చెప్పడానికి వివిధ రూపాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. చూపరులకు అందమైన నగరమనే చిత్రాన్ని చూపించేందుకు రహదారుల పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొని బతుకుతున్న వారి షాపులను తొలగించింది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొన్న విద్యా సంస్థలు, రియల్టర్లపై, పలుకుబడి కల్గిన పెద్దల ఆక్రమణలపై దయచూపి వదిలేసింది. ఈ ప్రేమ, కనికరం పరిశ్రమల భూసేకరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల పట్ల లేదు. పరిశ్రమాధిపతులను ఆకర్షించడానికి, వారికి ఆర్థిక ప్రయోజనం కల్పించడానికి వేల కోట్ల విలువైన రాయితీలు ప్రకటించి, సదుపాయాలు కల్పిస్తోంది. పెట్టుబడిదారులను మెప్పించేందు కు తాజాగా కార్మికుల పనిగంటలను 8 నుంచి 10కి పెంచింది.ఈ భాగస్వామ్య సదస్సులో కొత్త ఒప్పందాలు జరగనున్నాయి. ఇందులో ఎన్ని ఒప్పందాలు, ఎన్ని సంవత్సరాలకు కార్యరూపం దాల్చుతాయనే దానికి సమాధానం దొరకదు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు పనిలో పనిగా ఈ భాగస్వామ్య సదస్సు సందర్భంగా శంకుస్థాపన చేయనున్నారు.రెండు దశల్లో రూ. 1,35,964 కోట్ల పెట్టుబడులతో 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల్గిన కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు మిట్టల్ ప్రకటించింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మిట్టల్‌కు తొలి దశలో 7.3 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన కంపెనీ ఏర్పాటుకు 2,200 ఎకరాలు కేటాయించింది. రెండో దశలో మరో 3,800 ఎకరాలు ఇవ్వనుంది. నక్కపల్లి మండలం, పెదతీనార్ల, సిహెచ్ఎల్ పురం, ఉపమాక, రాజయ్యపేట, నర్సాపురం, ఎస్.రాయవరం మండలం గుడివాడలో బల్క్ డ్రగ్ పార్కుకు 1270.80 ఎకరాలు కేటాయించింది. వీటికి కేటాయించిన భూమి హక్కుదారులకు, యజమానులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించలేదు. అంతేకాదు, విశ్వవ్యాపితంగా కీర్తి సంపాదించిన ప్రభుత్వ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడానికి ముందుకురాని ప్రభుత్వం, ప్రైవేటు మిట్టల్ స్టీల్‌కు కోట్ల రూపాయల రాయితీలు ప్రకటించి, గనులు కేటాయించడానికి ఏర్పాట్లు చేస్తోంది.ఇవేగాక స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించింది. పదేళ్ల వరకు కిలో లీటర్ నీరు రూ.50 చొప్పున సరఫరా చేయడానికి అంగీకరించింది. 15 ఏళ్ల వరకు ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇ.డి) మినహాయింపు, కంపెనీ నిర్మాణ సామాగ్రి, అమ్మకాలపై వంద శాతం ఎస్‌జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ యూనిట్‌కు రూపాయి చొప్పున సరఫరా చేయనున్నట్లు ప్రభుత్వం 2024 అక్టోబర్ 18న జిఓ 76 విడుదల చేసింది. ఇవి కాకుండా మిట్టల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేందుకు పెట్టిన షరతులన్నింటికీ తలూపింది. మిట్టల్‌కు కేటాయించిన భూమిలో స్టీల్ కంపెనీ ఆధారిత యూనిట్లకు లీజుకు ఇచ్చుకొనే అవకాశం కూడా కల్పించింది.రెండు దశల్లో కంపెనీలో 55 వేల మందికి ఉ పాధి కల్పిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం, ఆ ఉపాధిలో ఏ తరహా ఉద్యోగాలు ఎన్ని? ఇందులో స్థానికులు, నిర్వాసితులకు ఎన్ని? అనే స్పష్టత లేదు. స్థానికులకు 75 శాతం ఉపాధిపై ఎటువంటి హామీ ఇవ్వలేదు. మిట్టల్ స్టీల్ ఏర్పాటుపై పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ)లో స్థానికుల ఉపాధి ఊసే ఎత్తలేదు. ఇఐఎ నివేదికను పరిశీలిస్తే ప్రభుత్వం చెబుతున్నట్లు ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఆశ ఏ కోశానా కనిపించడం లేదు. 17.8 మిలియన్ టన్నుల ఉ త్పత్తి సామర్థ్యం కల్గిన మిట్టల్ స్టీల్ ఉత్పత్తి దశలో కేవలం 800 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని పేర్కొంది. దీంతో ప్రభుత్వం చెబుతున్న ఉపాధి వట్టిదేనని తేలిపోయింది.విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) నిమిత్తం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) సేకరించిన భూములకు చెందిన యాజమానులు, సాగుదారులకు పరిహారం చెల్లించడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రావడంలేదు. పరిహారం చెల్లించాలని అడిగే అవకాశం లేకుండా నిర్బంధ పరిస్థితు లను ప్రభుత్వం సృష్టిస్తోంది. రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్య నియోజకవర్గం పాయక రావుపేట పరిధిలోని మిట్టల్ స్టీల్, బల్క్ డ్రగ్ పార్కులో భూములు, ఇళ్లు కోల్పోయి బాధపడుతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని గొంతు విప్పి మాట్లాడే హక్కు అక్కడ కరువైంది. ప్రభుత్వం భారీ సంఖ్యలో పోలీసులను దించి భయభ్రాంతులకు గురిజేస్తోంది.చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్య పేట, అమలాపురం పంచాయతీ మూలపర్రలో ఇళ్లు, సాగు భూములకు నష్టపరిహారం పూర్తిగా చెల్లించలేదు. డి ఫారం, సాగు భూముల్లోని తోటలకు నష్టపరహారం జమచేయలేదు. సొసైటీ భూములకు పరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తోంది. చెట్లకు నామమాత్రపు పరిహారం చెల్లించింది. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటోందని, ఇప్పటికే హెటిరో కాలుష్యంతో తమ జీవితాలు దెబ్బతిన్నాయని చెబుతున్న రాజయ్యపేట, పరిసర ప్రాంత మత్స్యకారుల గోడు ప్రభుత్వం ఆలకించడంలేదు. ఈ అనుభవాలతో బల్క్ డ్రగ్ పార్కు వద్దని మత్స్యకారులు కోరుతున్నారు. ఆందోళన చేస్తున్నారు. అయినా సాధారణ ప్రజల బతుకులు పట్టని ఈ ప్రభుత్వాలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం చట్టపరమైన నిబంధనలు పట్టించుకోవడంలేదు. పోలీసులను గ్రామాల్లో దించి తమ సమస్యలను బాహ్య ప్రపంచానికి చెప్పుకొనే వీలు లేకుండా ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోంది. ఈ పరిస్థితుల్లో నిర్వాసితులు, బాధితులు మరింత పట్టుదలతో ఐక్యతను ప్రదర్శించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించు కొనేందుకు బలమైన పోరాటాలు నిర్వహించాలి. యువత ఉ పాధిపై స్పష్టమైన, లిఖితపూర్వక హామీ పొందాలి. కోల్పోయిన ఆస్తులకు పరిహారం సాధించాలి.

## ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేస్తా

ఒంగోలు,ఇంటికో పారిశ్రామికవేత్త ఉండాలనేది తమ లక్ష్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. అలాగే చిన్నతరహార పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానికంగా ఉన్న అవకాశాలు వినియోగించుకుని యువత ముందుకు రావాలన్నారు. ఈ క్రమంలో మహిళలు కూడా అవాకాశాలను అంది పుచ్చుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని పేర్కొన్నారు. ఈ ఏడాది లక్ష మంది మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. వినూత్న ఆలోచనలతో కొత్త పరికరాలను విద్యార్థులు తయారుచేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడులో సీఎం పర్యటించారు. ఇందులో భాగంగా ఎంస్ఎంఈ పార్కును ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఇవాళ 329 ఎకరాల్లో 15 పారిశ్రామిక పార్కులను సీఎం ప్రారంభించారు. 587 ఎకరాల్లో మిగిలిన 35 ప్రభుత్వ, ప్రైవేటు ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండం నాయునపల్లిలో చేనేత పార్కుకూ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగం చేస్తున్నాం. రాజధాని కోసం 29 వేల మందిరైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారు. వారు ఇచ్చిన భూమిని అభివృద్ధి చేసి వారికి అప్పగిస్తున్నాం. రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మిస్తాం. రాష్ట్రానికి అనేక పెట్టుబడులు తీసుకొచ్చాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను మళ్లీ తీసుకొస్తున్నాం. పెట్టుబడులు తీసుకొచ్చి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నాం. 20 లక్షల ఉద్యోగాలంటే చాలా మంది అవహేళన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ వారమంతా పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. కష్టపడి పనిచేసే అద్భుత యువత ఏపీలో ఉంది. గత వైకాపా పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడంతో వారు పారిపోయారని చంద్రబాబు అన్నారు. ఇకపోతే పలు జిల్లాల్లో మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తొలి దెబ్బ సిద్ధూ మీదనేనా ?

న్యూఢిల్లీ,బీహార్ లో రెండో విడత చివరి విడత ఎన్నికలు మంగళవారంతో పూర్తి అయిపోతున్నాయి. ఇక రెండు రోజుల తరువాత కౌంటింగ్ ఉంది. ఈ నెల 14న ఫలితాలు వస్తాయి. బీహార్ లో ఎవరి గెలిచేది జనాలు తీర్పు ఇస్తారు. ఈసారి ఫలితం అయితే మహా ఘట్ బంధన్ కి అనుకూలంగా ఉంటుందని ఇండియా కూటమి నేతలు చాలా నమ్మకంగా ఉన్నారు. ఈసారి ఘట్ బంధన్ గెలిచి బీహార్ కైవశం అయితే మాత్రం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ క్రెడిట్ లో సింహ భాగం అందుకుంటారు అని అంటున్నారు. ఆయన బీహార్ ఎన్నికల కంటే ముందే నిర్వహించిన ఓటర్ చోరీ యాత్రకు బ్రహ్మాండమైన స్పందన లభించింది. ఒక విధంగా జనాల మూడ్ ని ముందే మార్చేసినట్లుగా కూడా చెబుతున్నారు.

గెలిస్తే జరిగేది :

ఇండియా కూటమి కట్టాక వరస పరాజయాలే పలకరించాయి. కేంద్రంలో 2024 ఎన్నికల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తామని వేసుకున్న అంచనాలు తప్పాయి. మూడోసారి కూడా మోడీ ప్రధానిగా ప్రమాణం చేసి హ్యాట్రిక్ పీఎం అనిపించుకున్నారు. ఇక హర్యానా మహారాష్ట్రలలో కూడా పెట్టుకున్న ఆశలు నిరాశ అయ్యాయి. అక్కడా ఎన్డీయేదే పై చేయి అయింది. ఢిల్లీలో చూసుకుంటే రెండున్నర దశాబ్దాల తరువాత బీజేపీ గెలిచి జెండా ఎగరేసింది.

బీహార్ బూస్ట్ :

సరే ఇన్ని రకాలుగా ఇబ్బంది పడుతున్నా ఇండియా కూటమి కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలని నిర్ణయించుకుని మరీ బీహార్ బరిలోకి దిగింది. బీహార్ లో కనుక అధికారం దక్కితే మెల్లగా హిందీ బెల్ట్ ని పాకేందుకు ఆస్కారం ఉ ంటుందని దేశంలో అత్యధికం ఎంపీ సీట్లు ఉన్న ఉత్తరాదిన మార్పు కచ్చితంగా వస్తుందని అది 2029 ఎన్నికల్లో బాగా దోహదపడుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. అంతే కాదు బీహార్ ఇచ్చిన బూస్ట్ తో ఇండియా కూటమి మరింత శక్తివంతంగా మారి ఎన్డీయే మీద ఢీ కొట్టేందుకు ఇంకా కొత్త ఉత్సాహం చూపిస్తుంది అని అంటున్నారు.

రాహుల్ కీ రోల్ :

కాంగ్రెస్ అగ్ర నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్టీలో కీలక నిర్ణయాల విషయంలో ఇంతకాలం ఆచీ తూచీ వ్యవహరిస్తూ వచ్చారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నా వాయిదా వేస్తూ వచ్చారు. దానికి కారణం దేశంలో ప్రజల మూడ్ నాడి అందిపుచ్చుకుని తమకు సానుకూలం చేసుకునేందుకే ఈ ప్రయత్నం అని అంటున్నారు. ఇపుడు బీహార్ కనుక ఇండియా కూటమికి దక్కితే కాంగ్రెస్ సంస్థాగతంగా కూడా మరింత బలంగా మారి సంచలన నిర్ణాయలు తీసుకునే చాన్స్ ఉంది అని అంటున్నారు. రాహుల్ సైతం ఎటువటి తడబాటూ తాత్సారం లేకుండా ముఖ్యమైన నిర్ణయాలనే తీసుకుంటారు అని అంటున్నారు.

కర్ణాటక ఫోకస్ :

ఇక లేటెస్ట్ గా చూస్తే కన్నడ కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్యకు కేంద్ర కాంగ్రెస్ పెద్దల అపాయింట్మెంట్ లభించలేదు అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. నిజానికి చూస్తే కనుక కేంద్ర కాంగ్రెస్ పెద్దలతో సమావేశం కావాలని సిద్ధరామయ్య భావించారు, కానీ ఆ సమావేశం అవసరం లేదని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని అంటున్నారు. దాంతో కర్ణాటక సీఎం పీఠం కదులుతోందని వార్తలు జోరుగా షికారు చేస్తున్నాయి.

మాట ప్రకారం :

ఇక చూస్తే రెండున్నరేళ్ళ తర్వాత సిద్ధరామయ్య దిగిపోయి డీకే శివకుమార్ కి బాధ్యతలు అప్పగిస్తారు అని చాలా కాలంగా ప్రచారం ఉంది. ఆ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తోంది. దాంతో డీకేకి కన్నడ పగ్గాలు అప్పగించడానికి కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారా అందుకే సిద్ధరామయ్యకు అపాయింట్మెంట్ ఇవ్వలేదా అన్నది కూడా చర్చ సాగుతోంది. ఇక బీహార్ లో కనుక కాంగ్రెస్ కూటమి గెలిస్తే రాహుల్ గాంధీకి కాంగ్రెస్ కి కూడా మంచి బలం వస్తుందని దాంతో సంస్థాగతంగా కీలక నిర్ణయాలు మరింత దూకుడుగా తీసుకునే చాన్స్ ఉందని అంటున్నారు. అలా చూసుకుంటే బీహార్ తొలి దెబ్బ కన్నడ సిద్ధూకే తగులుతుందా అన్నది ఇపుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా ఉంది.

## డిమాండ్లు చాలానే !

అమరావతి,ఏపీలో కొత్త జిల్లాల ప్రకటనకు డెడ్ లైన్ పెట్టినట్లుగా తెలుస్తోంది. కొత్త జిల్లాలుగా ఎన్ని రాబోతున్నాయన్నది చూడాల్సి ఉంది. అదే సమయంలో ఉన్న 26 జిల్లాల స్వరూప స్వభావాలు మార్పు చేర్పులు ఏ విధంగా ఉంటాయన్నది కూడా ఆసక్తికరంగా ఉంది. కొత్త జిల్లాలను 22లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆనాటికి 13 ఉమ్మడి జిల్లాలు ఉండేవి. వాటిని డబుల్ చేశారు. అయిత పార్లమెంట్ నియోజకవర్గాలను ప్రమాణంగా తీసుకుని చేసిన ఈ విధానంలో శాస్త్రీయత లేదని కూటమి నేతలు అప్పట్లో విపక్షంలో ఉన్నపుడు ఆరోపించారు.

# ఎట్టకేలకు కోర్టు మెట్లెక్కనున్న జగన్



అమరావతి,వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసు విచారణ ఏళ్ళ తరబడి కొనసాగుతుందని విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. అంతేకాకుండా, కోర్టుకు రాకుండా వ్యక్తిగత హాజరు నుంచి జగన్ మినహాయింపు కోరుతూ ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఐదేళ్లు గడిపేశారని కూడా వైసీపీ హయాంలో ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. అయితే, ప్రస్తుతానికి ప్రతిపక్ష నేత కాని సాధారణ ఎమ్మెల్యే అయిన జగన్ ఇంకా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతుండడంపై పలువురు విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఈ నెల 14 లోపు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని హైదరాబాద్ లోని సీబీఐ కోర్టు ఆదేశించింది. అయితే, వ్యక్తిగతంగా విచారణకు హాజరుకాలేనని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ క్రమంలోనే జగన్ పిటిషన్ పై సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రకారం సీబీఐ కోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలోనే జగన్ కు సీబీఐ కోర్టు షాకిచ్చింది. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాల్సిందేనని సీబీఐ కోర్టు తేల్చి చెప్పింది. దీంతో, దిగి వచ్చిన జగన్ వ్యక్తిగత హాజరుకు మరో వారం రోజులు గడువు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 21 లోపు వ్యక్తిగతంగా జగన్ కోర్టుకు హాజరు కావాలని సీబీఐ కోర్టు ఆదేశించింది. జగన్ తరపు లాయర్ల అభ్యర్థన మేరకు వారం రోజుల గడువునిచ్చింది. చాలా ఏళ్ల విరామం అనంతరం జగన్ మళ్లీ కోర్టు మెట్లు ఎక్కబోతున్నారు.

# కర్నూలులో అతిపెద్ద బెవరేజస్ ఫ్యాక్టరీ



కర్నూలు,కర్నూలు జిల్లా బ్రాహ్మణపల్లిలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బ్రాహ్మణపల్లిలో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ప్రపంచంలో రెండవ అతిపెద్ద బేవరేజెస్ ప్లాంట్ కర్నూల్ జిల్లాకు తీసుకొచ్చామన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమైందని తెలిపారు. మెక్సికో తర్వాత రెండో ప్లాంట్ కర్నూలుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద రెండో ప్రాజెక్ట్ కర్నూలులో నెలకొల్పుతున్నారని తెలిపారు. మూడు వేల కోట్లతో రిలయన్స్ కర్నూలులో పెట్టుబడులు పెడుతోందని... దాదాపు ఐదు వేల మందికి ఉపాధి లభించనుందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ప్లాంట్‌ను అనుకున్న సమయానికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్లాంట్ రావడం వల్ల స్థానిక యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎయిర్ పోర్ట్‌లో శిక్షణా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సిగాచి కెమికల్స్ ఓర్వకల్లుకు కెమికల్ ఎ÷-లాంట్ వచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాల్లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ తెలిపారన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు రూ.23 కోట్లతో మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. సీబీఎన్ బ్రాండ్‌తోనే పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు కొనసాగితే ఏపీ అభివృద్ధిలో దూసుకెళ్తుందని.. అలాంటి లీడర్ నాయకత్వాన్ని మళ్ళీ గెలిపించుకోవాలని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.

# పార్టీ పదవులను త్వరలోనే భర్తీ చేస్తాం



అమరావతి,పెండింగ్‌లో ఉన్న అన్ని పార్టీ పోస్టులు త్వరితగతిన భర్తీ చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో పార్లమెంటరీ పార్టీ కార్యాలయాలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు స్థలాలు గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లతో మంగళవారం మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు మంత్రితో జోనల్ కోఆర్డినేటర్‌లు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, బీదా రవిచంద్ర యాదవ్, దామాచర్ల సత్య, సుజయ్ కృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవి రావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాస రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ప్రతిపక్షంలో ఉండి పోరాడినట్లే అధికారంలోనూ జోనల్ కోఆర్డినేటర్లు పని చేయాలని సూచించారు. పార్టీ అధికారం వచ్చిందని ఎవరూ నిర్లక్ష్యంతో ఉండకూడదని అన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఉన్న కసి, అధికారంలోనూ కొనసాగాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుని పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ఇన్చార్జ్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ఎన్నికల వ్యూహరచన చేయాలని ఆదేశించారు. జనసేన, బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్‌ల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న నియోజకవర్గాలకు తెలుగుదేశ పార్టీ ఇన్చార్జ్‌లను త్వరలోనే నియమిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యేలు వెళ్లి పార్టీ వ్యవవహారాలపై సమీక్షించాలన్నారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా గ్రీవెన్స్ నిర్వహించేలా పర్యవేక్షించాలని కోరారు. అర్జీలు ఇచ్చే వారికి ఎమ్మెల్యే స్థాయి లేదా ఇన్చార్జ్ మంత్రి స్థాయిలోనే సమస్య పరిష్కారమవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలకు కార్యకర్తలకు సమన్వయం పెంచే బాధ్యత జోనల్ కోఆర్డినేటర్లదేనన్నారు. జోనల్ కోఆర్డినేటర్ల పనితీరును ప్రతీ నెలా సమీక్షిస్తామని చెప్పారు. జోనల్ కోఆర్డినేటర్లే పార్టీకి అన్నీ తామై వ్యవహరించాలని సూచించారు. ఇన్చార్జ్ మంత్రులకు ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయం పెంచటం, ఎమ్మెల్యేలతో సమస్య ఉన్న చోట ఇన్చార్జ్ మంత్రిని కూర్చోపెట్టి పరిష్కరించే బాధ్యతను కోఆర్డినేటర్లు తీసుకోవాలని పేర్కొన్నారు. వైసీపీ పెట్టిన అక్రమ కేసులపై సమీక్షించి చట్టపరంగా పరిష్కరిద్దామని తెలిపారు.

# ఆ ముగ్గురి కలయికతో అద్భుతమైన ప్రగతి



గుంటూరు, ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలయిక అద్భుతమని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కొనియాడారు. ఈ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లాలో పర్యటించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను మామ అని పిలుస్తారు.. ఇకపై ఏపీ వారికి కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు వద్ద వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మొక్కలు నాటారు. బావిలో నుంచి స్వయంగా నీళ్లు తోడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ చూశాక చాలా సంతోషం వేసిందని శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. పురాతన చెరువును అత్యాధునికంగా తీర్చిదిద్దారని తెలిపారు. దీనిద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పశువులకు తాగునీరు లభిస్తుందని అన్నారు. మత్స్య సంపద పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి చెరువును ఉపయోగించవచ్చన్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచుతాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో చెరువుల పునరుద్ధరణ చేస్తానని మాటిచ్చారు. కేంద్రమంత్రి హోదా కంటే కూడా ప్రజలకు సేవ చేయడం కోసమే ఆంధ్రాకు వచ్చానని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రజా సేవను దైవ పూజగా భావిస్తానని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో నన్ను మామ అని అంటారని.. ఇకపై ఏపీ ప్రజలకు కూడా నేను మామనే అని వ్యాఖ్యానించారు.

# పవన్ నోట మరోసారి సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు మాట



అమరావతి,సనాతన ధర్మం గురించి గత కొంతకాలంగా ఏపీలో ప్రచారంలోకి వచ్చింది అంటే దానికి కారణం జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. ఆయన దాదాపు ఏడాది క్రితం సనాతన ధర్మం గురించి ఎలుగెత్తి మాట్లాడారు. మన ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన గత ఏడాది తిరుపతిలో ఏర్పాటు చేసిన ఒక అతి పెద్ద సభలో ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఈ మేరకు డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి అంటే ఒక చట్టబద్ధమైన బోర్డు అవసరం అని ఆయన పేర్కొన్నారు.

తాజా పరిణామాల నేపథ్యంలో :

ఇదిలా ఉంటే తిరుమల లడ్డూ కల్తీ అయింది అని గత ఏడాది పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అయింది. అదే సమయంలో అందులో కలపరానివి కలిపారు అని కూడా ప్రచారం సాగింది. ఆ సమయంలో పవన్ ఉగ్రరూపం దాల్చారు. ఆయన ఏకంగా లడ్డూ కల్తీ విషయం కోట్లాది మంది విశ్వాసానికి సంబంధించినది అని చాటి చెప్పారు. అంతే కాదు ఆయన సనాతన దీక్ష చేపట్టారు. తిరుమల కొండలను కాలి నడకన ఎక్కి మరీ శ్రీవారిని దర్శించారు. ఆ సమయంలోనే పవన్ నుంచి వచ్చిన మాట సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు.

వెలుగులోకి వాస్తవాలు :

ఇక చూతే దీని మీద దర్యాప్తు చేస్తున్న సిట్ తాజాగా తిరుమల లడ్డూ సమస్యకు సంబంధించి కీలక విషయాలను వెల్లడిస్తోంది. అలా బయటపడుతున్న దిగ్భ్రాంతికరమైన వాస్తవాలతో చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నెయ్యితో లడ్డూ లాంటి అంశాలు మొత్తం హిందూ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. దీనిపై ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరో సారి తనదైన శైలిలో తీవ్ర స్థాయిలో స్పందన వ్యక్తం చేశారు. లేటెస్ట్ గా ఆయన సనాతన పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని మరోసారి పిలుపునిచ్చారు.

ఆస్తిక జనుల విశ్వాసం :

ఇక పవన్ తాజాగా చేసిన ప్రకటనలో ప్రపంచ హిందూ సమాజానికి తిరుమల తిరుపతి దేవస్థానం ఒక తీర్థయాత్ర కేంద్రం కంటే ఎక్కువగా అభివర్ణించారు. అంతే కాదు అది ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక నివాస కేంద్రంగా పేర్కొన్నారు. ఇక తిరుపతి లడ్డూ కేవలం తీపి పదార్థం కాదని అది ఒక భక్తి భావన అన్నారు. ఈ లడ్డూని ఎవరైనా తమ స్నేహితులు కుటుంబ సభ్యులు ఇతరులకు పంచుతున్నప్పుడు అది ఒక ఆధ్యాత్మిక భావోద్వేగం కలుగచేస్తుంది అని ఆయన అన్నారు ఇది యావత్తు హిందువుల సమిష్టి విశ్వాసమని, అంతే కాదు ఒక లోతైన విశ్వాసాన్ని సైతం ఈ లడ్డూ ప్రసాదం ప్రతిబింబిస్తుందని అన్నారు

దెబ్బ తీసినట్లే :

లడ్డూ కానీ తిరుమల పవిత్రత కానీ కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇక తిరుమలకు సగటున ప్రతి సంవత్సరం దాదాపు 2.5 కోట్ల మంది భక్తులు వస్తారని పవన్ పేర్కొన్నారు. అలా సనాతన ధర్మం మీద విశ్వాసం ఉన్న వారు వారి మనో భావాలను, ఆచారాలను ఎగతాళి చేసినప్పుడు లేదా అణగదొక్కినప్పుడు అది కేవలం బాధ కలిగించేది మాత్రమే కాదని పవన్ అన్నారు. అది ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది విశ్వాసాన్ని, భక్తిని దెబ్బతీస్తుందని కళ్యాణ్ హెచ్చరించారు.

లౌకికవాదం అంటే :

ఇక లౌకికవాదం అన్నదే ఒక వైపే మాత్రం కాదని అది రెండు వైపులా ఉండాలని పవన్ స్పష్టం చేశారు. హిందువుల విశ్వాసానికి రక్షణకు గౌరవానికి సంబంధించిన అనేక విషయాలు చర్చించదగినవి ఏ మాత్రం కావు అని ఆయన పేర్కొంటూ అందుకే దేశంలో సనాతన పరిరక్షణ బోర్డు ఉండాలని పవన్ గట్టిగా కోరుకున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అతి పురాతనమైనది :

భారతదేశంలో సనాతన ధర్మం పురాతనమైనది అని పవన్ అన్నారు. అంతే కాకుండా అందరి వాటాదారుల ఏకాభిప్రాయంతో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేసేందుకు ఇదే కరెక్ట్ సమయం అని పవన్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తిరుమల లడ్డూ సమస్యపై ఇటీవలి దర్యాప్తు సాగుతోంది. అది ముమ్మరమైంది, దాంతో పవన్ తన స్పందనను ఈ విషయంలో వ్యక్తం చేశారు. సనాతన స్ఫూర్తిని నిలబెట్టడం కోసం తగిన చర్యలను తీసుకోవాలని పవన్ పేర్కొంటున్నారు. దేశంలో సనాతన ధర్మం అన్నది సజావుగా సాగేలా ఆ విషయాన్ని పర్యవేక్షించడానికి ఒక బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన తాజాగా పిలుపునిచ్చారు. మొత్తానికి పవన్ ఇచ్చిన ఈ పిలుపుతో దేశంలో మరోసారి సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు మీద చర్చకు తెర లేస్తోంది.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

యాదాద్రిభువనగిరి,ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందని, పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేశారు. రోజు ఈ విధంగానే భోజనం పెడుతున్నారా, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో విద్యార్థుల గణిత సామర్థ్యాన్ని ఆయన పరీక్షించారు. ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఎక్కువ మార్కులు వచ్చిన 250 మంది విద్యార్థులకు సైకిల్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు టాయిలెట్స్, వాటర్ పైప్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ను ఆదేశించారు. పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని దృష్టికి తీసుకురాగా పోలీసులు పెట్రోలింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జూలూరు పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, గతంలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, లారీలు టార్పాలిన్ కవర్స్, గన్నీ బ్యాగుల కొరత లేదన్నారు.

# మళ్లీ అదే ప్రశ్న: ఎగ్జిట్ పోల్స్ నమ్మొచ్చా?




హైదరాబాద్,దేశవ్యాప్తంగా 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికతోపాటు బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఈ పోలింగ్ ప్రక్రియ ముగిసీ ముగియగానే.. ఎగ్జిట్ పోల్ ఫలితాలను సర్వే సంస్థలు వెల్లడించాయి. వీటిలో బీహార్‌లో తిరిగి ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వమే వస్తుందని మెజారిటీ సర్వే సంస్థలు(దాదాపు అన్నీ) తేల్చి చెప్పాయి. మోడీ మ్యానియా బాగా వర్కవుట్ అయిందని.. ముఖ్యమంత్రి నితీష్‌కు ప్రజలు మరోసారి పట్టం కడుతున్నారని సర్వే సంస్థలు తేల్చి చెప్పాయి. ఇదే సమయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ వైపు ప్రజలు మొగ్గు చూపినట్టు పేర్కొన్నాయి. నిజానికి జూబ్లీహిల్స్‌లో బీఆర్ ఎస్ సెంటిమెంటును రాజేసింది. పైగా ఇది సిట్టింగ్ సీటు కావడంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన రోజు నుంచే ప్రచారం చేసింది. తొలి బీఫాం కూడా..మాగంటి సునీతకు ఇవ్వడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు కూడా పంపించామని చెప్పింది. ఇక, రాజకీయ వివాదాలు, విమర్శలు కామన్‌గా సాగిపోయాయి. అయినప్పటికీ.. ప్రజలు సెంటిమెంటుకు మొగ్గ చూపలేదన్న వాదనను సర్వే సంస్థలు పేర్కొన్నా యి. దీంతో కాంగ్రెస్ వైపే ప్రజలు మొగ్గు చూపారని, అయితే.. పోరు మాత్రం హోరా హోరీగానే సాగిందని పేర్కొన్నాయి. ఇలా సర్వే సంస్థలు ఎగ్జిట్ ఫలితాలను వెల్లడించాయి. అయితే.. సహజంగానే గెలుస్తామని ఆశలు పెట్టుకున్న పార్టీలు.. ఈ సంస్థల సర్వేలపై నమ్మకం లేదని చెబుతున్నాయి. వాస్తవ ఫలితమే తమకు గీటు రాయి అని బీహార్ విషయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్ బంధన్, జూబ్లీహిల్స్ విషయంలో బీఆర్ ఎస్ పార్టీలు కూడా చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వే సంస్థలను ఏమేరకు నమ్మొచ్చు? అనే ప్రశ్న మరోసారి తెరమీదకి వచ్చింది. వాస్తవానికి.. సర్వే సంస్థలు దాదాపు నిజమైన పరిస్థితులు ఉన్నప్పటికీ.. కొన్ని పట్టు తప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఏపీలో జగన్ అధికారంలోకి వస్తారని.. రెండు మూడు సర్వేలు చెప్పగా.. అది విఫలమైంది. కర్ణాటకలో కాంగ్రెస్ బొటాబొటి మార్కులతో వస్తుందని చెప్పినా.. ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ భారీ మెజారిటీ దక్కించుకుంది. ఇక, పంజాబ్, హరియాణాలలోనూ ఇలానే మిశ్రమ ఫలితం కనిపించింది. ఇక, కేంద్రంలో మోడీ సర్కారుమూడోసారి వస్తుందని.. భారీ మెజారిటీ కూడాదక్కించుకుంటారని చెప్పాయి. మూడో సారి మోడీ వచ్చినా.. కేవలం 248 స్థానాలకే పరిమితం అయ్యారు. దీంతో ఎన్డీయే పక్షాల బలంతో ఆయన గద్దె నెక్కారు. సో.. సర్వే ఫలితాలు అన్ని వేళలా నిజం కాకపోవడంతోపాటు.. మిశ్రమంగా ఉండడంతో మరోసారి నొమ్మొచ్చా? అనే ప్రశ్న తెరమీదికి రావడం గమనార్హం.

# ఏపీలో భారీగా పెరుగుతున్న క్యాన్సర్ కేసులు!

అమరావతి,క్యాన్సర్ కేసుల విషయంలో ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. అంతే కాదు ప్రభుత్వం తరపున పరీక్షలు చేయిస్తోంది. ముందస్తు పరీక్షలతో నివారణ కంటే నియంత్రణ ముఖ్యమన్న సూత్రాన్ని అనుసరిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏపీ వ్యాప్తంగా పెద్ద ఎత్తున క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలను నిర్వహిస్తున్నారు.

పెరుగుతున్న క్రమం :

ఇదిలా ఉంటే క్యాన్సర్ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు చేపట్టిన అసంక్రమిత వ్యాధుల నియంత్రణ నివారణ కార్యక్రమం 4.0 ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 39 లక్షల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మహిళలకు నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు జరుగుతున్నాయని, మగ వారికి నోటి క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు జరిగాయని చెప్పారు. . పరీక్షలు చేయించుకున్న వారిలో బ్రెస్టు క్యాన్సర్ 9 వేల 963 మందికి ఉంటే సర్వైకల్ క్యాన్సర్ 22 వేల 861 మంది మహిళలలో అనుమానిత లక్షణాలు కలిగిన వారు ఉన్నారని చెప్పారు. అలాగే నోటి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు కలిగిన వారు 26 వేల639 మంది ఉన్నారని డేటాని ముందుంచారు.

అలా వ్యాధి నిర్ధారణ :

ఇదిలా ఉంటే అనుమానితులుగా ఉన్న వారిని మరోమారు ఆయా ప్రాంతాల పీహెచ్ సి వైద్యులు పరీక్షలు చేసిన తరువాత అవసరమైన వారిని ఆయా జిల్లాల్లోని బోధనాసుపత్రులకు పంపుతున్నారు. అక్కడి ఆంకాలజిస్టులు మరోమారు క్యాన్సర్ అనుమానిత కేసులను పరిశీలించిన అనంతరం వారికి వ్యాధి పరిస్థితిని నిర్ధారణ చేస్తారు. తదనుగుణంగా చికిత్స మొదలవుతుంది. ఈ చికిత్స నిమిత్తం బోధనాసుపత్రుల్లో ప్రత్యేకంగా 222 నెంబరుతో ఓపీ రూముని సైతం కేటాయించారు.



ప్రజలలో అవగాహన :

ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఏపీలో క్యాన్సర్ కేసుల విషయంలో అవగాహన కల్పించడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఇపుడు ప్రజలలో సానుకూల స్పందన లభిస్తోంది. సెప్టెంబరు 17 నుంచి ప్రారంభమైన అసంక్రమిత వ్యాధుల నియంత్రణ నివారణ కార్యక్రమం 4.0 స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణ ప్రాధాన్యంపై ప్రజలలో సానుకూల మార్పు కనిపిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెబుతున్నారు. వెల్లడించారు. ఇక రానున్న ఆరు నెలల కాలంలో మిగిలిన వారికి ఈ పరీక్షలు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా మంత్రి సత్యకుమార్ యాదవ్ అంటున్నారు.

ఆందోళనగా ఉన్నా :

ఇదిలా ఉంటే ఏపీలో క్యాన్సర్ కేసుల విషయంలో కొంత ఆందోళన కనిపిస్తున్నా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి ముందస్తుగా గుర్తించడం వల్ల ప్రారంభ దశలోనే వాటిని సరైన చికిత్సతో నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. దాంతో ఆ దిశగానే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com